




# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు








సంపుటి : 11 | సంచిక : 299 | పేజీలు : 8+8 | ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ : పి. గౌతమి | శుక్రవారం 4 జూలై 2025

Published form Medchal Malkajgiri, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda


## కేటీఆర్, హరీశ్ రావు కాదు.. కేసీఆర్ మాట్లాడితే నేను మాట్లాడతా



- బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై మంత్రి కోమటిరెడ్డి తీవ్ర వ్యాఖ్యలు
- కేసీఆర్ అసెంబ్లీకి వస్తేనే చర్చకు సిద్ధమని స్పష్టీకరణ
- కేటీఆర్, హరీశ్ రావులను తాము లెక్కలోకి తీసుకోబోమని వ్యాఖ్య
- హరీశ్ రావు కేవలం ఎమ్మెల్యే మాత్రమేనని ఎద్దేవా
- తెలంగాణ ఇచ్చింది కాంగ్రెస్ పార్టీయేనని పునరుద్ఘాటన

**హైదరాబాద్ పెన్ పవర్:** బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. కేసీఆర్ అసెంబ్లీకి రావాలని, ఆయన వస్తే ప్రతిపక్షాలు కోరుతున్న అన్ని అంశాలపై చర్చించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని సవాల్ విసిరారు. ఉన్నతాధికారులతో రోడ్ల అభివృద్ధిపై సమీక్ష నిర్వహించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్ రావులను తాము అసలు లెక్కలోకే తీసుకోవడం

వివరాలు 2లో..

# హైదరాబాద్‌కు ప్రపంచ నగరాలతోనే పోటీ

- మహేశ్వరంలో ఇండస్ట్రియల్ పార్కును ప్రారంభించిన సీఎం రేవంత్
- వందేళ్ల లక్ష్యంతో 'విజన్-2047' ప్రణాళికను రచిస్తున్నామన్న ప్రభుత్వం
- పెట్టుబడిదారులకు పూర్తి రక్షణ కల్పిస్తామని హామీ
- తయారీ రంగంలో 9 శాతానికి పైగా వృద్ధి సాధించామన్న మంత్రి శ్రీధర్ బాబు
- 15 రోజుల్లోనే పరిశ్రమల అనుమతులు మంజూరు చేస్తున్నామని వెల్లడి




**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ రాజధాని హైదరాబాద్ దేశంలోని ఇతర నగరాలతో పోటీ పడటం లేదని, ప్రపంచంలోని అగ్రశ్రేణి నగరాలతో పోటీ పడుతోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని, రాబోయే వందేళ్లను దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి ప్రణాళికలు రచిస్తున్నామని స్పష్టం చేశారు. గురువారం నాడు రంగారెడ్డి జిల్లా మహేశ్వరంలో మంత్రి శ్రీధర్ బాబుతో కలిసి ముఖ్యమంత్రి పర్యటించారు. అక్కడ కొత్తగా ఏర్పాటు చేసిన ఇండస్ట్రియల్ పార్కుతో పాటు, 'మలబార్ జెమ్స్ అండ్ జ్యువెలరీ' తయారీ విభాగాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సీఎం మాట్లాడారు. తమ కాంగ్రెస్ ప్రభుత్వం దేశానికే ఒక 'ఫ్యూచర్ సిటీ'ని అందిస్తోందని పేర్కొ న్నారు. "రానున్న వందేళ్ల అవసరాలను దృష్టిలో పెట్టుకుని 'విజన్-2047' ప్రణాళికను రూపొందిం చాం. నగర అభివృద్ధి కోసం దేశ, విదేశీ కన్సల్టెంట్లు పని చేస్తున్నారు. రాష్ట్రానికి వచ్చే పెట్టుబడిదారులకు పూర్తి రక్షణ కల్పించి, వారి వ్యాపారాలు లాభదాయకంగా సాగేలా చూసే బాధ్యత మాది" అని ముఖ్యమంత్రి భరోసా ఇచ్చారు. అభివృద్ధిలో తెలంగాణ.. తమిళనాడు, కేరళ వంటి రాష్ట్రాలతో పోటీ పడుతోందని తెలిపారు. అంతకుముందు మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ, రాష్ట్రంలో తయారీ రంగం 9 శాతానికి పైగా వృద్ధి సాధిస్తోందని

వివరాలు 2లో..

## చికాగోలో కాల్పుల కలకలం.. నలుగురి మృతి, 14 మందికి గాయాలు




- అమెరికాలోని చికాగోలో దారుణమైన కాల్పుల ఘటన
- కారులో వచ్చిన దుండగులు గుంపుపై కాల్పులకు తెగబడ్డారు
- ఈ ఘటనలో నలుగురు అక్కడికక్కడే మృతి
- మరో 14 మందికి తీవ్ర గాయాలు, ముగ్గురి పరిస్థితి విషమం
- నిందితుల కోసం గాలిస్తున్న పోలీసులు, దర్యాప్తు ముమ్మరం

వివరాలు 2లో..

## భారత్‌లో 2,500 పార్టీలు ఉన్నాయి... ప్రధాని మోదీ చెప్పగానే ఆశ్చర్యపోయిన ఘనా ఎంపీలు



- ఆఫ్రికా దేశం ఘనాలో ప్రధాని నరేంద్ర మోదీ పర్యటన
- దేశ అత్యున్నత పురస్కారంతో ప్రధానికి ఘన సత్కారం
- ఘనా పార్లమెంట్‌లో ప్రధాని మోదీ ప్రసంగం
- ఆఫ్రికా అభివృద్ధికి భారత్ తోడ్పాటునందిస్తుందని హామీ
- ముప్పై ఏళ్ల తర్వాత ఘనా వెళ్లిన భారత ప్రధానిగా గుర్తింపు

వివరాలు 2లో..

## హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ మోసం
### రూ.2 కోట్లకు పైగా కొల్లగొట్టిన నెల్లూరు జంట అరెస్ట్

- రియల్ ఎస్టేట్ పెట్టుబడుల పేరుతో భారీ మోసం
- అధిక లాభాల ఆశ చూపి రూ.2.11 కోట్లు వసూలు
- నెల్లూరుకు చెందిన భార్యాభర్తలు పనేమ్ సురేశ్, ఉజ్వల అరెస్ట్
- హైదరాబాద్‌లోని పలు పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదు
- అగర్‌వుడ్ ఫార్మ్‌ల్యాండ్, క్రిస్ట్ ప్రాపర్టీస్ పేర్లతో స్కామ్
- సైబరాబాద్ ఆర్థిక నేరాల విభాగం పోలీసుల దర్యాప్తు



**హైదరాబాద్ పెన్ పవర్:** రియల్ ఎస్టేట్ వ్యాపారంలో పెట్టుబడులు పెడితే అధిక లాభాలు వస్తాయని నమ్మించి కోట్లాది రూపాయలు కొల్లగొట్టిన దంపతులను సైబరాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు జిల్లాకు చెందిన పనేమ్ సురేశ్, పనేమ్ ఉజ్వల భార్యాభర్తలు ఈ మోసానికి పాల్పడినట్లు అధికారులు గుర్తించారు. నిందితులు మెసర్స్ క్రిస్ట్ ప్రాపర్టీస్, అగర్‌వుడ్ ఫార్మ్‌ల్యాండ్ వంటి పేర్లతో కంపెనీలను సృష్టించారు. రియల్ ఎస్టేట్ వెంచర్లలో పెట్టుబడి పెడితే తక్కువ కాలంలోనే భారీ లాభాలు పొందవచ్చని పలువురిని నమ్మించారు. వీరి మాటలు నమ్మిన బాధితుల నుంచి సుమారు రూ. 2.11 కోట్లు వసూలు చేసి మోసం చేశారు. డబ్బులు చెల్లించిన తర్వాత ఎంతకూ లాభాలు రాకపోగా, అసలు కూడా తిరిగి ఇవ్వకపోవడంతో మోసపోయామని గ్రహించిన బాధితులు పోలీసులను ఆశ్రయించారు. ఈ దంపతులపై సైబరాబాద్

వివరాలు 2లో..

## అంగన్వాడీ హెల్పర్లకు తెలంగాణ సర్కార్ గుడ్ న్యూస్

- తెలంగాణ అంగన్వాడీ హెల్పర్లకు శుభవార్త
- టీచర్లుగా పదోన్నతికి వయోపరిమితి పెంపు
- 45 ఏళ్ల నుంచి 50 ఏళ్లకు పెంచుతూ నిర్ణయం
- రాష్ట్రవ్యాప్తంగా 4,322 మందికి ప్రయోజనం
- కీలక ఫైలుపై మంత్రి సీతక్క ఆమోద ముద్ర






**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణలోని అంగన్వాడీ సహాయకులకు రాష్ట్ర ప్రభుత్వం ఒక శుభవార్తను అందించింది. అంగన్వాడీ టీచర్లుగా పదోన్నతి పొందేందుకు ఉన్న గరిష్ఠ వయోపరిమితిని పెంచుతూ ఒక కీలక నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయం ద్వారా వేలాది మంది సహాయకులకు ప్రయోజనం చేకూరనుంది. ఇంతవరకు అంగన్వాడీ సహాయకుల నుంచి టీచర్లుగా పదోన్నతి పొందాలంటే గరిష్ఠ వయసు 45 ఏళ్లుగా ఉండేది. తాజాగా మహిళా, శిశు సంక్షేమ శాఖ ఈ నిబం ధనను సవరించి, వయోపరిమితిని 50 ఏళ్లకు పెంచింది. ఈ మార్పునకు సంబంధించిన ఫైలుపై ఆ శాఖ మంత్రి సీతక్క గురువారం సంతకం చేసి ఆమోదం తెలిపారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వల్ల రాష్ట్రవ్యాప్తంగా పని చేస్తున్న 4,322 మంది అంగన్వాడీ సహాయకులకు పదోన్నతి పొందేందుకు మార్గం సుగమమైంది. మంత్రి ఆమోదం లభించడంతో ఈ అంశంపై అధికారిక ఉత్తర్వులు త్వరలోనే వెలువడనున్నాయని సంబంధిత వర్గాలు తెలిపాయి.

## ఆకస్మిక మరణాలకు టీకాలకు సంబంధం లేదు



- కొవిడ్ టీకాలపై ఆందోళన.. స్పందించిన ఎయిమ్స్, సీరమ్ ఇన్‌స్టిట్యూట్
- కర్ణాటక సీఎం వ్యాఖ్యలతో మొదలైన చర్చ
- టీకాలు తీసుకున్నవారికే గుండెపోటు ముప్పు తక్కువన్న ఎయిమ్స్
- ఐసీఎంఆర్, కేంద్ర ప్రభుత్వ అధ్యయనాల్లోనూ ఇదే విషయం వెల్లడి

**హైదరాబాద్ పెన్ పవర్:** కొవిడ్-19 టీకాల భద్రతపై మరోసారి తలెత్తిన సందేహాలను వైద్య నిపుణులు, టీకా తయారీ సంస్థలు ఖండించాయి. ఇటీవలి కాలంలో సంభవిస్తున్న ఆకస్మిక మరణాల, గుండెపోటులకు వ్యాక్సిన్‌లకు ఎటువంటి సంబంధం లేదని స్పష్టం చేశాయి. ఈ విషయంలో భారత వైద్య పరిశోధన మండలి (ఐసీఎంఆర్), ఎయిమ్స్ ఆధ్వర్యంలో జరిగిన

వివరాలు 2లో..

## ఆ గేటు తాళం పగలగొట్టండి.. హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆదేశాలు..

**హైదరాబాద్ పెన్ పవర్:** హైడ్రా కమిషనర్ రంగనాథ్ అధికారుల బృందంతో కలిసి గురువారం బాలానగర్?లో పర్యటిం చారు. కాంగ్రెస్ నాయకులతో కలిసి వినాయకనగర్ కాలనీలోని గడ్డి చేను స్థలాన్ని అనుకుని ఉన్న నాలాను పరిశీలించారు. నాలాను పరిశీలించడానికి వెళ్లే దారికి గేట్లు వేసి తాళాలు వేయడంతో స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గేటుకు వేసిన తాళాన్ని పగలగొట్టండని రంగనాథ్



వివరాలు 2లో..

## బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు అనారోగ్యం.. యశోదా ఆసుపత్రిలో చేరిక

**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ హైదరాబాద్‌లోని సోమాజిగూ డ యశోద ఆస్పత్రిలో చేరారు. సీజనల్ ఫీవర్‌తో బాధపడుతున్న ఆయన చికిత్స నిమిత్తం హాస్పిట ల్‌కు వెళ్లారు. ఆయనకు వైద్య పరీక్షలు చేశారు. కేసీఆర్ హాస్పిటల్‌లో అడ్మిట్ అవ్వాల్సిన అవసరం లేనప్పటికీ మూడు రోజుల పాటు నందినగర్‌లోని నివాసంలోనే ఆయన ఉండనున్నారు. వైద్యులు ఎప్పటికప్పుడు ఆయన ఆరోగ్య పరిస్థితిని సమీక్షించనున్నారు. వాతావరణం మారడం, వర్షాలు కురుస్తుండటంతో సీజనల్ జ్వరంతో బాధపడుతున్న

వివరాలు 2లో..



## భారత్ దెబ్బకు చైనాపై నమ్మకం పోయిందా? అగ్రరాజ్యం బాట పట్టిన పాక్

- అమెరికా పర్యటనలో పాకిస్థాన్ ఎయిర్‌ఫోర్స్ చీఫ్
- కొద్ది రోజుల క్రితమే అమెరికాకు వెళ్లి వచ్చిన పాక్ ఆర్మీ చీఫ్
- చైనా ఆయుధ వ్యవస్థలపై సన్నగిల్లిన నమ్మకమే కారణం
- 'ఆపరేషన్ సిందూర్' సమయంలో విఫలమైన చైనా రాడార్లు
- అమెరికా నుంచి ఎఫ్-16 జెట్లు, క్షిపణుల కొనుగోలుకు ప్రయత్నాలు
- అగ్రరాజ్యంతో రక్షణ బంధాన్ని బలోపేతం చేసుకోవడమే లక్ష్యం



**హైదరాబాద్ పెన్ పవర్:** పాకిస్థాన్ ఉన్నత సైనికాధికారులు వరుసగా అమెరికా పర్యటనలకు వెళ్లడం చర్చనీయాంశంగా మారింది. ఇటీవలే పాక్ ఆర్మీ చీఫ్ జనరల్ అసీమ్ మునీర్ అమెరికాలో పర్యటించి రాగా, ప్రస్తుతం పాక్ ఎయిర్‌ఫోర్స్ చీఫ్ జహీర్ అహ్మద్ బాబర్ సిద్దు అగ్రరాజ్యం బాట పట్టారు. చైనా నుంచి కొనుగోలు చేసిన ఆయుధ వ్యవస్థల పనితీరుపై తీవ్ర అనుమానాలు తలెత్తిన నేపథ్యంలో అమెరికాతో రక్షణ సంబంధాలను తిరిగి బలోపేతం చేసుకునేందుకే ఈ పర్యటనలు జరుగుతున్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇటీవల 'ఆపరేషన్ సిందూర్' పేరిట భారత్ ప్రయోగించిన క్షిపణులను గుర్తించడంలో గానీ, అడ్డుకోవడంలో

వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

### జగన్ నేతల పై ఆధారపడటం లేదా? అందుకే కొత్త స్ట్రాటజీకి దిగుతున్నారా?

వైసీపీ అధినేత వైఎస్ జగన్ వేగం పెంచారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటయి ఏడాది పూర్తి కావడంతో ఇక జనంలోకి వెళ్లేందుకు ప్లాన్ చేసుకుంటున్నారు. అలాగే కొత్త నేతలకు కూడా అవకాశం కల్పించేందుకు సిద్ధమవుతున్నారు. పార్టీ నుంచి వెళ్లిపోయిన వారిని ఇక పార్టీలోకి తిరిగి తీసుకోకుండా వారి స్థానంలో యువనేతలకు ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించారు. అందులో భాగంగానే నిన్న జరిగిన పార్టీ యువజన విభాగం నేతలతో జరిగిన సమావేశంలో మంచి నేతలను గుర్తించి పార్టీలోకి తీసుకు రావాలని అనడం కూడా అందులో భాగమేనని అంటున్నారు. కొన్ని నియోజకవర్గాలలో ఇప్పటి వరకూ ఇన్ ఛార్జులను నియమించకపోవడంతో కొత్త వారికి అవకాశం ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిసింది.

**కొత్త తరం నేతలకు...**

వైసీపీ ఖచ్చితంగా ఈ సారి అధికారంలోకి వస్తుందని భావిస్తున్న జగన్ అందుకు అనుగుణంగా కార్యకర్తలకు పెద్దపీట వేయాలని నిర్ణయించారు. యువజన విభాగాన్ని పటిష్టం చేయడంతో పాటు పార్టీ అనుబంధ విభాగాలను కూడా మరింత బలోపేతం చేసే దిశగా అడుగులు వేస్తున్నారు. కేసులకు భయపడి వెనుకంజ వేయవద్దని పార్టీలో కష్టపడిన వారికి గుర్తింపు ఉంటుందని భరోసా ఇస్తూ ఇక ఎఫెన్స్ లో వెళ్లేందుకు జగన్ నిర్ణయించుకుంటున్నట్లు తెలిసింది. అందుకే యువకులతో పాటు విద్యార్థి విభాగాన్ని కూడా బలోపేతం చేయడంతో పాటు మహిళ విభాగాన్ని కూడా మరింతగా శక్తిమంతం చేసి అధికార పార్టీకి కంటి మీద కునుకు లేకుండా చేయాలన్న యోచనలో ఉన్నారు.

**అనుబంధ సంఘాలను...**

త్వరలోనే వైఎస్ జగన్ వైసీపీ విద్యార్థి విభాగం, మహిళ విభాగం నేతలతో కూడా సమావేశం అయ్యే అవకాశాలున్నాయని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మరొక వైపు జగన్ తాను స్వయంగా సమస్యలపై జిల్లాలను పర్యటిస్తూ పార్టీకి మరింత హైప్ తేవాలని ప్రయత్నిస్తున్నారు. ఏ చిన్న అవకాశం వచ్చినా ఏ వర్గాన్ని దూరం చేసుకోకుండా దగ్గరకు తీసుకునే యత్నంలోనే జగన్ ఉన్నట్లు కనపడుతుంది. గుంటూరులో మిర్చిరైతులు, పొదిలిలో పొగాకు రైతులకు గిట్టుబాటు ధరల కోసం వెళ్లి వారితో మాట్లాడిన జగన్ తాజాగా ఈనెల 9న చిత్తూరు జిల్లా మామిడి రైతులతో కూడా సమావేశం కానున్నారు. ఇలా జిల్లా పర్యటనలతో పాటు మరొకవైపు పార్టీ అనుబంధ విభాగాలపై కూడా ఫోకస్ పెట్టారు.

**సోషల్ మీడియా వింగ్ ను...**

వైసీపీ సోషల్ మీడియా వింగ్ ను కూడా బలోపేతం చేసే దిశగా జగన్ ప్రయత్నాలు ప్రారంభించారు. సోషల్ మీడియా వారియర్స్ పై అక్రమ కేసులు పెడుతున్నారని, అయినా బెదరకుండా పనిచేసిన వారికి తాము అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రాధాన్యత ఇస్తున్నామని చెబుతూ వస్తున్నారు. వైసీపీకి సోషల్ మీడియా బలం ఎక్కువ అన్న నేపథ్యంలో ఇటీవల అక్రమ కేసులతో కొంత వెనకబడి ఉండటాన్ని గమనించిన జగన్ ఆ దిశగా వారికి ధైర్యాన్ని కల్పించి, కేసులు వస్తే తాము అండగా ఉంటామని చెబుతున్నారు. మొత్తం మీద పార్టీ నేతలపై జగన్ ఆధారపడకుండా ఇక అనుబంధ విభాగాలను బలోపేతం చేసి పార్టీని ముందుకు తీసుకెళ్లాలని నిర్ణయించినట్లు కనపడుతుంది.

# ఆ గేటు తాళం పగలగొట్టండి.. హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆదేశాలు..

- మొదటి పేజీ తరువాయి

అధికారులను ఆదేశించారు. ఆనంద్ రెడ్డి అనే వ్యక్తి హుటాహుటిన రావడంతో గేటుకు తాళం వేయడం సరికాదని హైడ్రా కమిషనర్ హెచ్చరించారు. తాళాలు తీసి లోపలికి వెళ్ళి నాలా ఆక్రమణలను తొలగించాలని ఆదేశించారు. అనంతరం వినాయక నగర్, కళ్యాణ్ నగర్ వద్ద ఉన్న నాలాలను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా హైడ్రా కమిషనర్ రంగనాథ్ మాట్లాడుతూ.. నాలా ఉన్న ప్రాంతం ఎక్కడైతే ఖాళీ స్థలం ఉందో.. మొదట అక్కడ ఆక్రమణలను తక్షణమే తొలగిస్తామని అన్నారు. నాలా లోపల స్లీట్?ను కూడా తొలగించాల్సిన అవసరం ఉందన్నారు. వారం రోజుల్లో స్థానిక కాలనీ ప్రజలతో సమావేశం ఏర్పాటు చేస్తామనున్నారు. డ్రోన్ కెమెరాతో నాలా మొత్తం పొడవునా వీడియో తీసి చిత్రీకరిస్తామని అన్నారు. నాలా ఆక్రమణలు మాత్రం ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేనిది స్పష్టం చేశారు.

# చికాగోలో కాల్పుల కలకలం.. నలుగురి మృతి, 14 మందికి గాయాలు

అమెరికాలో మరోసారి కాల్పుల ఘటన చోటు చేసుకుంది. చికాగో నగరంలోని రివర్ నార్త్ ప్రాంతంలో బుధవారం రాత్రి జరిగిన డ్రైవ్-బై షూటింగ్‌లో నలుగురు మరణించగా, మరో 14 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. క్షతగాత్రుల్లో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉందని అధికారులు గురువారం వెల్లడించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, రివర్ నార్త్ ఏరియాలోని ఒక రెస్టారెంట్ వెలుపల కొందరు గుంపుగా నిలబడి ఉన్నారు. మీడియా కథనాల ప్రకారం, అంతకుముందే ఆ రెస్టారెంట్‌లో ఓ ర్యాపర్ తన ఆల్బమ్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమం ముగిసిన తర్వాత బయట ఉన్న వారి వద్దకు వేగంగా ఓ కారు వచ్చింది. అందులో ఉన్న గుర్తు తెలియని వ్యక్తులు ఒక్కసారిగా గుంపుపై కాల్పులకు తెగబడి, వెంటనే అక్కడి నుంచి పరారయ్యారు. ఈ కాల్పుల ఘటనలో గాయపడిన పలువురికి తమ ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నామని నార్త్‌వెస్టర్న్ మెడిసిన్ ప్రతినిధి క్రిస్ కింగ్ తెలిపారు. అయితే, బాధితుల సంఖ్య, వారి ఆరోగ్య పరిస్థితిపై వివరాలు తెలియాల్సి ఉంది. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు, నిందితుల కోసం ముమ్మరంగా గాలిస్తున్నారు.

# బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు అనారోగ్యం.. యశోదా ఆసుపత్రిలో చేరిక

- మొదటి పేజీ తరువాయి

కేసీఆర్ గురువారం సాయంత్రం ఎర్రవెల్లి ఫాం హౌస్ నుంచి హైదరాబాద్?కు చేరుకున్నారు. నేరుగా బంజారాహిల్స్‌లోని నందినగర్ లో ఉన్న ఆయన నివాసానికి వెళ్లారు. వైద్యులు ఆయన ఇంటికి వచ్చి ఆయన ఆరోగ్య పరిస్థితిని చూశారు. యశోదా హాస్పిటల్?కు వైద్య పరీక్షలకు రావాలని సూచించారు. వైద్యుల సలహా మేరకు కేసీఆర్ సాధారణ వైద్య పరీక్షల కోసం సోమాజీగూడ యశోదా ఆసుపత్రికి వెళ్లారు. కేసీఆర్?తో పాటు ఆయన సతీమణి శోభ, సంతోష్ కుమార్, హరీష్ రావు కూడా ఆసుపత్రికి వెళ్లడం గమనార్హం.

# హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ మోసం రూ.2 కోట్లకు పైగా కొల్లగొట్టిన నెల్లూరు జంట అరెస్ట్

- మొదటి పేజీ తరువాయి

కమిషనరేట్ పరిధిలోని బాచుపల్లి, కొల్లూరు, చందానగర్, మాదాపూర్ పోలీస్ స్టేషన్లలో పలు కేసులు నమోదయ్యాయి. కేసు నమోదు చేసుకున్న సైబరాబాద్ ఆర్థిక నేరాల విభాగం పోలీసులు దర్యాప్తు చేపట్టి నిందితులను అరెస్టు చేశారు.

# భారత్‌లో 2,500 పార్టీలు ఉన్నాయి... ప్రధాని మోదీ చెప్పగానే ఆశ్చర్యపోయిన ఘనా ఎంపీలు

"భారతదేశంలో సుమారు 2,500 రాజకీయ పార్టీలు ఉన్నాయి" అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేసిన ప్రకటన విన్న ఘనా పార్లమెంట్ సభ్యులు ఒక్కసారిగా ఆశ్చర్యానికి గురయ్యారు. వారి స్పందనను గమనించిన ప్రధాని మోదీ చిరునవ్వులు చిందించారు. ఆఫ్రికా దేశమైన ఘనాలో పర్యటిస్తున్న ఆయన, గురువారం ఆ దేశ పార్లమెంట్‌ను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా భారత ప్రజాస్వామ్య వైవిధ్యం, దాని స్ఫూర్తి గురించి ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. దేశంలోని వివిధ రాష్ట్రాలను భిన్నమైన పార్టీలు పాలిస్తున్నాయని, 22 అధికారిక భాషలతో పాటు వేల సంఖ్యలో ఇతర భాషలు ఉన్నాయని మోదీ తెలిపారు. ఈ భిన్నత్వమే భారతీయుల విశాల హృదయానికి కారణమని, అందుకే ప్రపంచంలో ఎక్కడికెళ్లినా భారతీయులు అందరితో సులభంగా కలిసిపోతారని వివరించారు.

ఈ పర్యటనలో భాగంగా ప్రధాని మోదీకి అరుదైన గౌరవం దక్కింది. ఘనా దేశ అత్యున్నత పురస్కారమైన 'ది ఆఫీసర్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ది స్టార్ ఆఫ్ ఘనా' అవార్డుతో ఆ దేశ ప్రభుత్వం ఆయనను సత్కరించింది. రాజధాని అక్రాలో జరిగిన కార్యక్రమంలో

ఘనా అధ్యక్షుడు జాన్ డ్రమానీ చేతుల మీదుగా మోదీ ఈ పురస్కారాన్ని స్వీకరించారు. ఈ అవార్డును 140 కోట్ల మంది భారతీయులకు అంకితమిస్తున్నట్లు ప్రధానమంత్రి ప్రకటించారు. 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని మోదీ పునరుద్ఘాటించారు. ఆఫ్రికా అభివృద్ధి ప్రయాణంలో భారత్ అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు. జీ20 కూటమిలో ఆఫ్రికా యూనియన్‌కు శాశ్వత సభ్యత్వం లభించడంపై ఆయన సంతోషం వ్యక్తం చేశారు. గత మూడు దశాబ్దాల తర్వాత ఒక భారత ప్రధాని ఘనాలో పర్యటించడం ఇదే మొదటిసారి.

# కేటీఆర్, హరీశ్ రావు కాదు.. కేసీఆర్ మాట్లాడితే నేను మాట్లాడతా

- మొదటి పేజీ తరువాయి

లేదని కోమటిరెడ్డి అన్నారు. "నేను హరీశ్ రావు, కేటీఆర్ మీద మాట్లాడను. కేసీఆర్ మాట్లాడితే మాట్లాడతాను. వీరు ఫ్లోర్ లీడర్లు ఏమీ కాదు. మాజీ మంత్రులు, ప్రస్తుతం ఎమ్మెల్యేలు" అంటూ ఆయన వ్యాఖ్యానించారు. తెలంగాణ ఉద్యమంలో తాము కీలక పాత్ర పోషించామని, రాష్ట్రాన్ని ఇచ్చింది కాంగ్రెస్ పార్టీయేనని ఆయన గుర్తుచేశారు. ప్రభుత్వ తప్పుఒప్పులపై చర్చించాలంటే ప్రతిపక్ష నేత హోదాలో కేసీఆర్ సభకు రావాలని డిమాండ్ చేశారు.

# హైదరాబాద్‌కు ప్రపంచ నగరాలతోనే పోటీ

- మొదటి పేజీ తరువాయి

వివరించారు. ప్రభుత్వం ఇటీవల గ్రీన్ ఇండస్ట్రియల్, నూతన ఎంఎస్ఎంఈ పాలసీ-2025ను ఆమోదించిందని గుర్తుచేశారు. కొత్త పరిశ్రమల ఏర్పాటు కోసం 4,200 దరఖాస్తులు రాగా, వాటిలో 98 శాతం దరఖాస్తులను కేవలం 15 రోజుల్లోనే పరిష్కరించామని చెప్పారు. సింగిల్ విండో విధానం ద్వారా పారదర్శకంగా, వేగంగా అనుమతులు మంజూరు చేస్తున్నామని ఆయన స్పష్టం చేశారు.

# ఆకస్మిక మరణాలకు టీకాలకు సంబంధం లేదు

- మొదటి పేజీ తరువాయి

రెండు వేర్వేరు అధ్యయనాలు కూడా ఇదే విషయాన్ని ధృవీకరించాయని నిపుణులు గుర్తు చేశారు.

కర్ణాటకలోని హసన్ జిల్లాలో నెల రోజుల వ్యవధిలో సుమారు 20 మంది గుండె సంబంధిత సమస్యలతో మరణించడంతో, ఆ మరణాలకు కొవిడ్ టీకాలే కారణం కావొచ్చంటూ అనుమానాలున్నాయని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్ధరామయ్య చేసిన వ్యాఖ్యలు సంచలనం సృష్టించాయి. ఈ నేపథ్యంలో ప్రముఖ టీకా తయారీ సంస్థ సీరమ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా, ఎయిమ్స్ వైద్యులు, కేంద్ర ఆరోగ్య శాఖ దీనిపై స్పష్టతనిచ్చాయి. ఈ అంశంపై ఢిల్లీ ఎయిమ్స్ మాజీ డైరెక్టర్ డాక్టర్ రణ్‌దీప్ గులేరియా మాట్లాడుతూ, "యువతలో ఆకస్మిక మరణాలపై ఇప్పటికే లోతైన అధ్యయనాలు జరిగాయి. వ్యాక్సిన్లకు, గుండెపోటు మరణాలకు సంబంధం ఉన్నట్లు ఏ పరిశోధనలోనూ వెల్లడి కాలేదు. అన్ని ఔషధాల మాదిరిగానే వీటికి కొన్ని స్వల్ప దుష్ప్రభావాలు ఉండొచ్చు కానీ, ప్రాణాంతకం కాదు" అని వివరించారు.

ఎయిమ్స్ కార్డియాలజీ విభాగాధిపతి డాక్టర్ రాజీవ్ నారంగ్ కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. "ఐసీఎంఆర్, ఎయిమ్స్ అధ్యయనాల ప్రకారం కొవిడ్ టీకాలు తీసుకున్న వారికి ఆకస్మిక గుండెపోటు ముప్పు తక్కువగా ఉన్నట్లు తేలింది. వ్యాక్సిన్ వల్ల ప్రయోజనమే తప్ప హాని లేదని స్పష్టంగా రుజువైంది" అని ఆయన తెలిపారు. యువతలో సంభవిస్తున్న ఆకస్మిక మరణాలకు వారి జీవనశైలి, ముందస్తు ఆరోగ్య సమస్యలే ప్రధాన కారణమని, వ్యాక్సిన్‌లు కాదని కేంద్ర వైద్య-ఆరోగ్య శాఖ కూడా తేల్చి చెప్పింది. దేశీయంగా తయారైన టీకాలు సురక్షితమైనవని, వాటి పనితీరు సమర్థంగా ఉందని ఐసీఎంఆర్, జాతీయ రోగ నియంత్రణ కేంద్రం అధ్యయనాలు వెల్లడించాయని పేర్కొంది.

# భారత్ దెబ్బకు చైనాపై నమ్మకం పోయిందా? అగ్రరాజ్యం బాట పట్టిన పాక్

- మొదటి పేజీ తరువాయి

గానీ పాకిస్థాన్ గగనతల రక్షణ వ్యవస్థలు పూర్తిగా విఫలమయ్యాయి. చైనా నుంచి సేకరించిన హెచ్‌క్యూ-9, ఎల్‌వై-80 వంటి వ్యవస్థలు భారత క్షిపణుల ముందు తేలిపోయాయి. ఈ పరిణామంతో, ఇప్పటివరకు డ్రాగన్ దేశపు ఆయుధాలపైనే ప్రధానంగా ఆధారపడిన పాకిస్థాన్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. చైనా అందించిన సైనిక పరిజ్ఞానం విశ్వసనీయతపై నీలినీడలు కమ్ముకున్నాయి.

ఈ నేపథ్యంలోనే పాక్ ఎయిర్‌ఫోర్స్ చీఫ్ తన పర్యటనలో భాగంగా అమెరికా సైనిక ఉన్నతాధికారులతో సమావేశమవుతున్నారు. చైనా ఆయుధాలపై నమ్మకం కోల్పోయిన పాకిస్థాన్, ఇప్పుడు తన వైమానిక దళాన్ని అమెరికా ఆయుధాలతో ఆధునీకరించాలని చూస్తోంది.

ముఖ్యంగా ఎఫ్-16 యుద్ధ విమానాలు, అత్యాధునిక గగనతల రక్షణ వ్యవస్థలు, గగనతలం నుంచి గగనతలంలోని లక్ష్యాలను ఛేదించే ఎయిమ్-7 స్పారో వంటి క్షిపణులను కొనుగోలు చేయాలని పాక్ భావిస్తున్నట్టు సమాచారం. గత దశాబ్ద కాలంగా చైనాతో పాకిస్థాన్ పెంచుకున్న స్నేహం పట్ల అసంతృప్తితో ఉన్న అమెరికాతో సంబంధాలను చక్కదిద్దుకొని, రక్షణ కొనుగోళు పెంచుకోవడమే ఈ పర్యటనల ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది.

# అరెస్ట్ ఎప్పుడు చేస్తారు? ఎదురుచూస్తున్నా... ప్రభుత్వానికి పేర్ని నాని సవాల్

తన అరెస్ట్ గురించి కొన్ని రోజులుగా జరుగుతున్న ప్రచారంపై వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కృష్ణా జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి పేర్ని నాని తీవ్రస్థాయిలో స్పందించారు. తనపై ఇప్పటివరకు ఎలాంటి ఎఫ్ఐఆర్ నమోదు కాలేదని, అలాంటప్పుడు అరెస్ట్ ఎలా చేస్తారని ప్రశ్నించారు. దమ్ముంటే తనను అరెస్ట్ చేయాలంటూ ప్రభుత్వానికి ఆయన బహిరంగంగా సవాల్ విసిరారు. గురువారం మచిలీపట్నంలో పార్టీ కార్యకర్తలతో సమావేశమైన అనంతరం పేర్ని నాని మీడియాతో మాట్లాడారు. "గత నెల రోజులుగా నన్ను అరెస్ట్ చేస్తారని కొన్ని మీడియా సంస్థలు ప్రచారం చేస్తున్నాయి. నేను పారిపోతాననే ఉద్దేశంతో ఇలాంటి వార్తలు సృష్టిస్తున్నారు. కానీ నేను ఎక్కడికీ వెళ్లను, ఇక్కడే ఉంటాను" అని ఆయన తేల్చిచెప్పారు. ఇది కేవలం పచ్చ మీడియా చేస్తున్న విష ప్రచారమని, వారి సునకానందం కోసమే ఇలాంటి రాతలు రాస్తున్నారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిన నేపథ్యంలో, ప్రజల దృష్టిని మరల్చేందుకే (డైవర్షన్ పాలిటిక్స్) తన అరెస్ట్ అంశాన్ని తెరపైకి తెచ్చారని పేర్ని నాని ఆరోపించారు. స్థానిక మంత్రి కొల్లు రవీంద్రపై ఆయన తీవ్ర విమర్శలు చేశారు. "బందరు పోర్టు, ఫిషింగ్ హార్బర్ పనులు జరుగుతుంటే రాని ఆనందం, నన్ను అరెస్ట్ చేస్తే మంత్రి కొల్లు రవీంద్ర కళ్లలో కనిపిస్తుందట. ఇంతకంటే శాడిజం ఉంటుందా?" అని నాని ప్రశ్నించారు. ఒకవేళ ప్రభుత్వం తప్పుడు కేసులు పెట్టి ఎఫ్ఐఆర్ నమోదు చేసినా, తాను చట్టపరంగా, న్యాయపరంగా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నానని ధీమా వ్యక్తం చేశారు. న్యాయస్థానాల్లో పోరాడి, బెయిల్‌పై బయటకు వచ్చి మళ్లీ వైఎస్ జగన్ జెండాను మోస్తానని అన్నారు. నకిలీ ఇళ్ల పట్టాల కేసులో తనపై వస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదని, బందరులో ఇచ్చిన ప్రతి పట్టా రికార్డులు ప్రభుత్వ వెబ్‌పోర్టల్‌తో పాటు అన్ని సంబంధిత కార్యాలయాల్లో ఉన్నాయని ఆయన స్పష్టం చేశారు.

# కరేడు భూముల జోలికొస్తే చూస్తూ ఊరుకోం

నెల్లూరు జిల్లా కరేడులో ఇండోసోల్ కంపెనీ సోలార్ ప్లాంట్ ఏర్పాటు కోసం ప్రభుత్వం చేపట్టిన భూసేకరణపై ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పచ్చని పొలాలను నాశనం చేసి పరిశ్రమలు పెట్టాలనుకోవడం దారుణమని, కరేడు రైతుల భూముల జోలికి వస్తే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఆమె హెచ్చరించారు. గత వైసీపీ ప్రభుత్వం ఈ కంపెనీకి అనుమతులు ఇస్తే, ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఏకంగా ఊరినే ఖాళీ చేయించేలా భూములు కేటాయించాలని చూడటం అన్యాయమని పేర్కొన్నారు. ఈ మేరకు కరేడు రైతులు చేస్తున్న పోరాటానికి కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. "కరేడు రైతులది బతుకు పోరాటం. ఊరిని చంపి పరిశ్రమ పెడతాం అంటే చూస్తూ ఊరుకునేది లేదు. కరేడు భూములు జోలికొస్తే రైతుల పక్షాన ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తాం. పచ్చటి పొలాల్లో ప్రజా అభిప్రాయం సేకరించకుండా భూ సేకరణకు నోటిఫికేషన్ ఇవ్వడం దుర్మార్గం. ఇది కూటమి ప్రభుత్వ నియంత పోకడకు నిదర్శనం. ప్రజల నిర్ణయానికి వ్యతిరేకంగా ఇండోసోల్ సోలార్ కంపెనీకి 8,458 ఎకరాలు దారాదత్తం చేస్తామనడం ద్రోహం. గత వైసీపీ ప్రభుత్వం షిరిడీ సాయి అనుబంధ కంపెనీకి అనుమతులు ఇస్తే, ఇప్పుడు కూటమి ప్రభుత్వం భూ సేకరణకు కనీసం గ్రామ సభలు పెట్టలేదు. మూడు పంటలు పండే పచ్చటి పొలాల్లో పరిశ్రమ వద్దంటున్న రైతుల గోడు వినలేదు. ఇండోసోల్ కంపెనీకి అదనంగా భూములు కేటాయించి, ఊరినే ఖాళీ చేయించాలని చూస్తున్నారు. శాంతియుత ఉద్యమం చేసే కరేడు గ్రామ ప్రజలను నిర్బంధించడాన్ని, అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నాం. కూటమి ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నాం. వెంటనే భూసేకరణకు ఇచ్చిన నోటిఫిషన్ ను రద్దు చేయండి.

# "ఇంకెన్నాళ్లు? ఈ ఆదివాసీ విద్యార్థుల మరణాలు!"

- గిరిజన విద్యార్థి సంఘం నాయకుల ఆవేదన
- అల్లూరి జిల్లాలో ఆదివాసీ విద్యార్థుల మృతి కలచివేస్తున్న వాస్తవం
- హెల్త్ అసిస్టెంట్లు తక్షణమే నియమించాలన్న డిమాండ్



**స్టాఫ్ రిపోర్టర్,పాడేరు/గూడెం కొత్తవీధి,పెన్ పవర్,జూలై3:** తల్లికి వందనం అంటూ పాఠశాలలు ప్రారంభమైన వారం దాటకముందే ఆదివాసీ విద్యార్థుల మరణాల వార్తలు వెలుగు చూస్తుండటం ఆందోళన కలిగిస్తోంది.గిరిజన విద్యార్థి సంఘం ( జి.ఎస్.యు) నాయకులు బూడిదే మాధవరావు (ప్రధాన కార్యదర్శి) ప్రభుత్వాన్ని హితవు పలుకుతూ, ప్రతి పాఠశాలలో హెల్త్ అసిస్టెంట్లను తక్షణమే నియమించాలని డిమాండ్ చేశారు.గత ఐదేళ్లలో అల్లూరి జిల్లాలో గల పాఠశాలల పరిధిలో అనేకమంది గిరిజన విద్యార్థులు అనుమానాస్పదంగా మృతి చెందగా, కేవలం గత రెండు సంవత్సరాలలోనే సుమారు 32 మంది విద్యార్థుల మృతివార్తలు వెలుగుచూశాయి. ఈ క్రమంలో తల్లిదండ్రులు భయభ్రాంతులకు గురవుతూ, తమ పిల్లలను పాఠశాలలకు పంపేందుకు వెనుకంజ వేస్తున్నారు.ఇటీవల, జూలై 1వ తేదీన జి. మాడుగుల మండలంలోని సులభం పంచాయతీ, సెరుబయలు గ్రామానికి చెందిన పీవీటిజి తెగకు చెందిన 8వ తరగతి విద్యార్థిని మర్రి లక్ష్మీ బంధవీధి గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో అకస్మాత్తుగా మరణించడం తీవ్ర కలకలం రేపింది.ఈ మృతి స్కూల్ యాజమాన్యం, అధికారుల నిర్లక్ష్యం వల్లే జరిగిందని గిరిజన విద్యార్థి సంఘం ఆరోపించింది. "ఇలాంటివి ఇక పునరావృతం కాకూడదు. సిక్ లీడర్ల పేరుతో విద్యార్థులే మందులు ఇచ్చే పరిస్థితి వల్ల మరిన్ని ప్రాణాలు నష్టమయ్యే అవకాశం ఉంది. అందుకే హెల్త్ అసిస్టెంట్ల నియామకం అత్యవసరం," అని బూడిదే మాధవరావు అన్నారు.గతంలో గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి హెల్త్ అసిస్టెంట్ల నియామకంపై హామీ ఇచ్చినప్పటికీ, అది వాస్తవంగా అమలుకాకపోవడం గమనార్హం. గత ప్రభుత్వ హయాంలో హెల్త్ అసిస్టెంట్లను తొలగించడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని, ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఇదే తప్పును పునరావృతం చేయకూడదని హెచ్చరించారు.విద్యార్థుల మౌలిక సదుపాయాలు, ఆరోగ్య పరిరక్షణపై ప్రభుత్వాల నిర్లక్ష్యాన్ని ఎండగడుతూ, జిల్లా కలెక్టర్, ఐటిడిఎ పీఓ, గిరిజన సంక్షేమ శాఖ అధికారులను జిల్లాలోని ప్రతి పాఠశాల సందర్శించి సమస్యలను పరిష్కరించాలని కోరారు.మర్రి లక్ష్మీ కుటుంబానికి న్యాయం జరగాలనీ, ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలనీ గిరిజన విద్యార్థి సంఘం డిమాండ్ చేసింది.ఈ కార్యక్రమంలో జి.ఎస్.యు జిల్లా అధ్యక్షులు కీరసాని కిషోర్, డివిజన్ అధ్యక్షులు మణుగూరు బాబుజి, మండల అధ్యక్షులు బోయిని అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# బావుల్లో క్లోరినేషన్ వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- ఎం పి డి ఓ ప్రేమ్ సాగర్.






**దుంబ్రిగుడ, పెన్ పవర్,జూలై 3:** మండల వ్యాప్తంగా ఉన్న బోరు బావుల్లో క్లోరినేషన్ చేయడం జరిగిందని మండల అభివృద్ధి శాఖ అధికారి ప్రేమ్ సాగర్ అన్నారు. మండలంలోని సాగర పంచాయితీలో గురువారం సందర్శించి మంచినీటి అందించే ట్యాంక్ నీరును పరిశీలించి వాటర్ టెస్టింగ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాలు కారణంగా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు పంచాయతీరాజ్ కమిషన్ ఆదేశాల మేరకు మండల వ్యాప్తంగా ఉన్న అన్ని బోరుబావుల్లో వాటర్ టెస్టింగ్ నిర్వహించి దాని వేల్యూ వేషన్ తక్కువగా ఉంటే క్లోరినేషన్ చేస్తున్నమన్నారు. మండల వ్యాప్తంగా ఉన్న బోరు బావులు, చేతి పంపు బోర్లు తోపాటు అన్ని బావులను పరిశీలించి వాటర్ టెస్టింగ్ నిర్వహించి క్లోరినేషన్ చేయడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఈఓపిఆర్డి, ఇంజనీర్ అసిస్టెంట్లు, ఆయా పంచాయితీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# కళాకారుల బకాయిలు చెల్లించండి.

- మన్య సీమ కళాజాత అధ్యక్షులు అప్పలరాజు.



**దుంబ్రిగుడ, పెన్ పవర్,జూలై 3:**గత 2018 సంవత్సరంలో జన్మభూమి, గ్రామదర్శిని కార్యక్రమాలకు కళాజాత ద్వారా ప్రదర్శించిన బకాయి సొమ్మును ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తక్షణమే చెల్లించాలని మన్య సీమ కళాజాత బృందం అధ్యక్షులు ఎం. అప్పలరాజు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2018 సంవత్సరంలో తెలుగుదేశం పార్టీ తరపున అనేక మారుమూల గ్రామాల పంచాయతీల్లో జన్మభూమి, గ్రామదర్శిని వంటి కార్యక్రమాలు కళారూపంలో గిరిజనులకు అవగాహన కల్పించడం జరిగిందన్నారు.దానికి సంబంధించిన బకాయి సొమ్ము ఇప్పటివరకు చెల్లించకపోవడంతో కళాకారులు అంత తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని చెప్పారు. కలని నమ్ముకుని జీవనం సాగిస్తున్న కళాకారులకు ఇప్పటివరకు బకాయి సొమ్ములు చెల్లించకపోవడం తీవ్ర విచారకరం అన్నారు. 2018 సంవత్సరంలో అనేకమంది కళాకారులు అప్పులు చేసి అనేక గ్రామాల్లో కార్యక్రమాలు ప్రదర్శించడం జరిగిందన్నారు. బకాయి సొమ్ము కోసం కొంతమంది కళాకారులు పోరాడి అలసిపోయి జీవనం సాగించలేక అప్పులు పాలై మృతి చెందారని కూడా చెప్పారు. కళాకారుల బాధాకరమైన సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం స్పందించి కళాకారుల బకాయి సొమ్మును అందించాలని ఆయన కోరారు.

# బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్ ఘన స్వాగతం పలికిన బిజెపి శ్రేణులు



**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్, విశాఖపట్నం,జూలై 03.** :హైదరాబాదు నుండి ఇండిగో విమానంలో విశాఖ విమానాశ్రయం చేరుకున్న ఆంధ్రప్రదేశ్ బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్

విశాఖ విమానాశ్రయంలోగణ స్వాగతం పలికిన బిజెపి నాయకులు కార్యకర్తలు అభిమానులు

విశాఖ విమానాశ్రయం నుండి రోడ్డు మార్గాన నగరంలోకి ర్యాలీగా బయలుదేరిన మాధవ్...

మాధవ్ కామెంట్స్.తన తల్లిదండ్రులు ఆశీస్సు లతో తనకు ఒక ఉన్నతమైన పదవి చాపట్టడం చాలా గర్వంగా ఉందని మా పార్టీ ఉన్నతమైన సిద్ధాంతంతో కూడిన పార్టీ అని నేను విశాఖ వాసిగా గతంలో ఎమ్మెల్సీగా విశాఖలో పనిచే యడం జరిగిందని కూటంతో కలిసి సమస్యలు రాయలసీమ నుండి ఇటు శ్రీకాకుళం వరకు అభివృద్ధి చేస్తానని తెలిపారు

# అవినీతికి పాల్పడిన కానిస్టేబుల్ను సస్పెండ్

నగర పోలీసు కమీషనర్ డా.శంఖబ్రత బాగ్చి



**క్రైమ్ బ్యూరో,పెన్ పవర్, విశాఖపట్నం, జూలై 03** :విధులలో అవినీతికి పాల్పడిన ఒక కానిస్టేబుల్ ను సస్పెండ్ చేసిన నగర పోలీసు కమీషనర్ డా.శంఖబ్రత బాగ్చి,పి.ఎమ్ పాలెం నందు బీచ్ మొబైల్ కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్న జి. బాబూ రావు ఒక వైన్ షాప్ నందు పని చేస్తున్న వ్యక్తి నెంబరు సేకరించి, మరుసటి రోజు అతని నెంబరుకు వేరే వ్యక్తి ఫోన్ పే ద్వారా కొంత నగదు పంపి, కొంత సమయం తరువాత సదరు నగదును తన సొంత నంబరుకు పంపిం చుకున్న విషయం ప్రత్యేక నిఘా ద్వారా సిపి గారి దృష్టికి రావడం జరిగినది. ప్రాథమిక విచారణలో సదరు విషయం నిర్ధారణ జరిగినది.

పోలీసు కమీషనర్ పై సంఘటన పై తీవ్రంగా స్పందించి, సదరు జి. బాబూ రావు ను తక్షణమే విధుల నుండి సస్పెండ్ చేశారు.నగర పోలీసు శాఖ లో పని చేయు అధికారులు మరియు సిబ్బంది పూర్తి పారదర్శకముగా తమ విధులు నిర్వర్తించాలని, విధులలో ఎటువంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినా, అధికార దుర్వినియోగానికి పాల్పడినా, అవినీతికి పాల్ప డినా తక్షణమే వారిపై కఠిన చర్యలు ఉంటా యనీ తెలిపారు.

నగర పోలీసు శాఖలో ఎవరైనా లంచం అడి గినా , తీసుకున్నా వెంటనే సి.పి ఇచ్చిన 7995 095799 నంబరుకు తెలియజేయమని, వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచడం జరుగుతుందనీ సి.పి తెలియజేశారు.

# కొట్నాపల్లి క్వారీ పై చర్యలు తీసుకోరా...?



- క్వారీ పై అధికారులకు అంత ప్రేమ ఎందుకో.
- బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి పాంగి మత్స్య కొండ బాబు



**హుకుంపేట పెన్ పవర్ జూన్ 03 గురువారం :** హుకుంపేట మండల కేంద్రానికి అనుకుని వున్నా కొట్నాపల్లి క్వారీ పై సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకోవటం లో ఎందుకు విఫలం అవుతున్నారని బీజేవైఎం అరకు పార్లమెంట్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాంగి మత్స్య కొండ బాబు ప్రశ్నించారు, గత కొన్ని నెలలు గా కొట్నా పల్లి క్వారీ వల్ల ఇబ్బందులు ఎదురుకుంటున్నా ప్రజలు ఆందోళన లు చేస్తూ, స్పందన లో సైతం పిర్యాదు చేస్తున్నారని అయినా అధికారుల్లో కనీసం చలనం లేకపోవటం ఆశ్చర్యకరం అన్నారు, అనుమతులకు మించి రిగ్గింగ్ బ్లాస్ట్ చెయ్యటంతో సమీపంలోనీ గిరిజన ప్రజల అవాసాలు దెబ్బతినటమే కాకా అనారోగ్యల బారిన పడుతున్నామని, క్వారీ డస్ట్ వలన పంటలు కూడ సక్రమంగా పండే పరిస్థితి లేదని స్థానిక ప్రజలు తమ దృష్టికి తీసుకు వచ్చారాని అయన తెలిపారు, స్పందన లో పిర్యాదు చేసిన కూడ ఫలితం లేకపోవటం తో గిరిజన ప్రజలు ఆందోళనకు గురవుతున్నారని అన్నారు, మోతాదుకి మించి మందుగుండు రిగ్గింగి బ్లాస్టింగ్ చెయ్యటం మూలాన గర్భిణీ స్త్రీలు, ఈ లోకం చూడని పశు గుడ్డు కూడ వాయు కాలుష్యం, నీటి కాలుష్యం వల్ల అనారోగ్యం బారిన పడి గ్రహణం మొర్రి, ఊపిరి తిత్తుల సమస్య వంటి వ్యాధులతో జన్మించే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు,త్వరలో బాధిత గిరిజన గ్రామాలను మా రాష్ట్ర, జిల్లా నాయకులతో సందర్శించి అధికారుల అలసత్వం పై జాతీయ ఎస్టి కమిషన్, మానవ హక్కుల కమిషన్ కు పిర్యాదు చేస్తామని స్పష్టం చేసారు, ఇకనైనా ప్రజల కోసమే పని చెయ్యటానికి వచ్చిన అధికారులు ప్రజల పక్షాన నిలిచి కొట్నా పల్లి క్వారీ పై తగు చర్యలు తీసుకుని గిరిజన ప్రజలకు క్వారీ సమస్య నుంచి విముక్తి చెయ్యాలని డిమాండ్ చేసారు.

# ఎమ్ వి వి ఎస్ మూర్తి సేవలు మరువలేనివి

టిడిపి జిల్లా అధ్యక్షులు గండి బాబ్జి



**విశాఖ దక్షిణం,పెన్ పవర్, జూలై 03** :తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ఎం వి వి ఎస్ మూర్తి జయంతి సందర్భంగా జిల్లా తెలు గుదేశం పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రప టానికి జిల్లా అధ్యక్షులు గండి బాబ్జి పూలమాల లు వేసి ఘన నివాళులు అర్పించారు.ఈ సంద ర్భంగా బాబ్జి మాట్లాడుతూ ఎంవివిఎస్ మూర్తి సేవలు మరువలేనివి అని అన్నారు. లోక్ సభ సభ్యులు గా టిడిపి నేతగా నియోజకవర్గం అభి వృద్ధికి కృషి చేసి తద్వారా పార్టీ బలోపేతానికి ఎంతో కృషి చేశారని కొనియాడారు.కార్యక్ర మంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పొలమరశెట్టి శ్రీనివాసరావు, శాసనసభ మాజీ సభ్యులు కొండ పల్లి అప్పలనాయుడు , భీమిలి నియోజకవర్గం ఇంచార్జ్ కోరాడ రాజబాబు ,రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ ఈతలపాక సుజాత, పైలా ముత్యాల నాయుడు , వానపల్లి గాయత్రి ఫణి కుమారి , గణగళ్ళ సత్య , బుడుమూరి గోవిం ద్ ,పప్పు రాజారావు , ఒమ్మి అప్పలరాజు, నా గోతి శివాజీ, విజయనగరం మార్కెటింగ్ కమిటీ చైర్మన్ కర్రోతు వెంకట నరసింగరావు తదితరు లు పాల్గొన్నారు

# నర్సీపట్నంలో ఘనంగా ప్రపంచ మెకానిక్స్ డే



**నర్సీపట్నం, పెన్ పవర్ (జులై 03)** :ప్రపంచ మెకానిక్స్ డే ను నర్సీపట్నంలో శ్రీ విజయ దుర్గ మెకానిక్ వర్కర్స్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ద్విచక్ర వాహన మెకానిక్ లు అందరూ అట్టహాసంగా జరుపుకున్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు మాకిరెడ్డి అప్పారావు ఆధ్వర్యంలో మెకానిక్లు ప్రభుత్వ హాస్పిటల్లో రోగులకు పాలు, పండ్లు, రొట్టె అందజేశారు. అనంతరం మెకానిక్లు అందరూ బైకులపై సిబిఎం కాంపౌండ్ నుండి పెదబొడ్డేపల్లి వరకు ర్యాలీగా వచ్చారు. శ్రీ సరస్వతి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా యూనియన్ సభ్యులను ఉద్దేశించి అప్పారావు మాట్లాడుతూ ప్రపంచ మెకానిక్స్ డే సందర్భంగా అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. సభ్యులందరూ ఒకే మాటపై నిలబడుతూ సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్నారని ప్రశంసించారు. సంఘంలో ఏ సభ్యుడికి కష్టం వచ్చినా ఆదుకుంటున్నామని అన్నారు. భవిష్యత్తులో ప్రభుత్వం నుంచి మెకానిక్ లకు ప్రత్యేకంగా సంక్షేమ పథకాలు అందేలా రాష్ట్రస్థాయిలో యూనియన్ నాయకులు కృషి చేస్తున్నారన్నారు. సభ్యులందరికీ మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ బండారు చిరంజీవి, కార్యదర్శి ఆర్. బాబ్జి, సహాయ కార్యదర్శి కైసర్ల మూర్తి, కోశాధికారి రుత్తల గోవిందు, కచ్చర్ల గణేష్, కోయిలాడ శ్రీను, కేసనకుర్తి ఆచారి, మాకిరెడ్డి సత్తిబాబు, లోవ, రవి తదితరులు పాల్గొన్నారు.

# అండగా ఉంటా ... అధైర్య పడవద్దు..

- బాధిత కుటుంబాల కు పరామర్శ లో మాజీ ఉప ముఖ్యమంత్రి పుష్ప శ్రీవాణి..





**కురుపాం, పెన్ పవర్, జులై -03,** అండగా ఉంటా ... అధైర్య పడవద్దని మాజీ ఉప ముఖ్యమంత్రి పుష్ప శ్రీవాణి బాధిత కుటుంబాలకు బరోసనిచ్చారు. గురువారం కురుపాం మండలంలోని గొటివాడ, పి లేవిడి, మొండెంఖల్లు, వెంపటాపురం, నీలకంఠాపురం, బొడ్డమానగూడ గ్రామాలలో ఇటీవల మరణించిన వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేసారు. అలాగే అన్ని విధాలా ఆదుకుంటామని బాధిత కుటుంబాల సభ్యులకు బరోసానిచ్చారు.ఈ పరామర్శ కార్యక్రమం లో కురుపాం ఎంపీపీ శెట్టి పద్మావతి, జెడ్పీటీసీ గొర్లి సుజాత, వైఎస్సార్సీపీ కార్యకర్తలు, నాయకులు, పాల్గొన్నారు.

## టి.డి.ఆర్. లు జారీ ప్రక్రియకు పత్రాలను సమర్పించాలని

# రోడ్డు కొలతలను పరిశీలించిన జీవీఎంసీ కమిషనర్ .






**విశాఖ దక్షిణం, పెన్ పవర్, జూలై 03 :** జగదాంబ నుండి పాత పోస్ట్ ఆఫీస్ వరకు విస్తరించిన రోడ్డు కొలతలను పరిశీలించి, రోడ్డు విస్తరణలో ఆస్తులు కోల్పోయిన వారికి టిడిఆర్ లు జారీ చేసే విషయంలో సంబంధిత కొలతల లో ఎటువంటి తేడాలు లేకుండా చూడాలని చీఫ్ సిటీ ప్లానర్ ను జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశించారు. గురువారం ఆయన జీవీ ఎంసీ జోన్ -4 పరిధిలో గల జగదాంబ జంక్షన్ నుండి పాత పోస్ట్ ఆఫీస్ వరకు విస్తరింపజేసిన రోడ్డు కొలతలను స్వయంగా పరిశీలించారు.

ఈ సందర్భంగా జగదంబ జంక్షన్ నుండి పాత పోస్ట్ ఆఫీస్ వరకు రోడ్డు విస్తరించిన రోడ్డు మ్యాప్ ను పరిశీలించి, ఈ విస్తరణలో ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులు ఎన్ని ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. ఈ పరిశీలనలో ముందుగా సూపర్ బజార్ వద్ద ఉన్న విశాలాంధ్ర బుక్ హౌస్ ప్రతినిధులతో వారి ఆస్తికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకుని, విశాలాంధ్ర బుక్ హౌస్ లోపల కొలతలను నిర్వహించి టిడిఆర్ జారీకి సంబంధించిన పత్రాలను పరిశీలించారు. జగదాంబ జంక్షన్ నుండి పాత పోస్ట్ ఆఫీస్ వరకు

రోడ్డు విస్తరించక ముందు, విస్తరణ తర్వాత ఎన్ని ఆస్తులు విస్తరణలో కోల్పోయాయో అని ఆరా తీస్తూ, టిడిఆర్ లు ప్రస్తుతం జారీకి సంబంధించి ఏ స్థాయిలో ఉన్నాయని పట్టణ ప్రణాళిక అధికారులను అడిగి తెలుసుకున్నారు. పూర్ణ మార్కెట్ పాత ప్రభాత్ థియేటర్ వద్ద, రవీంద్ర గోల్డ్ కవరింగ్ దుకాణం, ఏవీఎన్ కాలేజీ డౌన్ సమీపంలోని శ్రీ సాయి అనంతలక్ష్మి ఎంటర్ప్రైజెస్ వ్యాపారుల కు సంబంధించిన ఆస్తుల కొలతలను,రోడ్డు విస్తరణ కొలతలను స్వయంగా పరిశీలించి వారి ఆస్తులకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. మొత్తం టిడిఆర్ లు విడుదల కు సంబంధించి ఫైల్స్ యొక్క కొలతలను క్షుణ్ణం గా పరిశీలించి, ఎటువంటి అవకతవకల కు అవకాశం లేకుండా టిడిఆర్ లు జారీ ప్రక్రియకు పత్రాలను సమర్పించాలని చీఫ్ సిటీ ప్లానర్ ను ఆదేశించారు.జీవీఎంసీ పరిధిలో టౌన్ సర్వే కు సంబంధించిన పూర్తి సమాచారంతో కూడిన రికార్డులను ఒక దస్తా కాపీనీ సమర్పించాలని ఎస్టేట్ ఆఫీసర్ పి. సన్యాసినాయుడును కమిషనర్ ఆదేశించారు.అనంతరం రవీంద్ర గోల్డ్ కవరింగ్ దుకాణం ముందు ఉన్న వ్యర్థాలను గత నాలుగు రోజుల నుండి తొలగించనందున పారిశుద్ధ నిర్వహణలో ఆలసత్వం వహించిన వార్డు శానిటరీ ఇన్స్పెక్టర్ శివ ప్రసాద్ పై ఆగ్రహం వ్యక్తం చేస్తూ అతనికి షోకాజు నోటీసు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు.పూర్ణ మార్కెట్ వద్ద వైజాగ్ ట్రెండ్స్, ప్రగతి ఫుట్వేర్ వ్యాపారస్తులు ఫుట్పాత్లను ఆక్రమించి వ్యాపా రాలు నిర్వహిస్తున్న వారిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఫుట్పాత్తులు పాదచారుల సౌకర్యార్థం నిర్మించామని, ఫుట్పాత్లను ఆక్రమించి వ్యాపా రాలు జరిపినట్లైతే తగిన చర్యలు చేపడతామ ని వారికి సూచిస్తూ, నగరంలో ఫుట్పాతులను ఆక్రమించి వ్యాపారాలను నిర్వహిస్తున్న వాటిని వెంటనే తొలగించే ప్రక్రియ చేపట్టాలని పట్టణ ప్రణాళిక అధికారులకు కమిషనర్ ఆదేశించారు.

ఈ పర్యటనలో సిటీ ప్లానర్ ధనుంజయ రెడ్డి, డిసిపి హరిదాస్, ఏసిపి ఝాన్సీ లక్ష్మి, టౌన్ సర్వేయర్ బాలకృష్ణ, టిపిఓ, వార్డు ప్లానింగ్ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## 13 వ వార్డు లో "సుపరిపాలనలో తొలి అడుగు"



**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్ విశాఖపట్నం జూలై 3** సుపరిపాలన లొ తొలి అడుగు కార్యక్రమం 13వ వార్డు లో తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారకరామారావు విగ్రహానికి పూలమాలు వేసి నివాళులు అర్పించిన కార్పొరేటర్ కెల్లా సునీత సత్యనారాయణ. చంద్రబాబునాయుడు సూచనలతో తూర్పు నియోజకవర్గ శాసనసభ్యులు వెలగపూడి రామకృష్ణ బాబు ఆదేశాల మేరకు వార్డు కార్పొరేటర్ కెల్ల సునీత సత్యనారాయణ.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్ డి ఎ కూటమి ప్రభుత్వం పాలన ఏడాది గడిచిన సందర్భంగా ప్రజల వద్దకు వెళ్లి కూటమి ప్రభుత్వం ఏడాదిలో చేసిన అభివృద్ధి,సంక్షేమ పథకాలు కోసం వివరించి, వారి కష్ట సుఖాలను అడిగి తెలుసుకొని, ఇచ్చిన మాట ప్రకారం రాబోయే రోజుల్లో మరిన్ని సంక్షేమ,అభివృద్ధి పథకాలు అమలు పరుస్తామని తెలిపారు. 13వ వార్డ్ 13 బూత్ పాండురంగాపురం 17 ఎర్ని దుర్గా నగర్ పరిసర ప్రాంతాలలో పర్యటించారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షులు, పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పాడి రైతులకు ప్రభుత్వం ప్రోత్సహం.

- పంపిణీ చేస్తున్న బొత్తాడ గౌరీ శంకర్.




**గుమ్మలక్ష్మీపురం జులై 03.పెన్ పవర్.** మండల కేంద్రంలో పాడి రైతులను ప్రోత్సహిస్తు ప్రభుత్వం రాయతీ పై పశు దాణా అందిస్తున్న గుమ్మలక్ష్మీపురం సర్పంచ్ బొత్తాడ గౌరీశంకర్ సచివాలయం పరిధిలో ఉన్న రైతు సేవా కేంద్రం వద్ద పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గురువారం పశు దాణా బస్తాలను రైతులకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ దాణా తో పశువులు ఆరోగ్యంగా ఉండి పాల ఉత్పత్తి పెరుగుతుందని గౌరీ శంకర్ అన్నారు,గుమ్మలక్ష్మీపురం,గౌరడ.పశు వైద్యధికారి పి.లక్ష్మణ రావు మాట్లాడుతూ మండలనికి 50 శాతం రాయతీ పై 4000 కేజీలు దాణా సిద్ధంగా ఉంది అని,రైతులు దాణాను వీనియోగించుకోవాలని లక్ష్మణరావు అన్నారు.ఈ కార్యక్రమం లో పశు సంవర్ధక శాఖ,సచివాలయం సిబ్బంది. రైతులు పాల్గొన్నారు.

## గిరిజన ప్రాంతాలలో బ్యాంకింగ్ సేవల అవగాహన.





**గుమ్మలక్ష్మీపురం జులై 03. పెన్ పవర్.** గిరిజనల్లో బ్యాంకింగ్ సేవల పట్ల అవగాహన పెంచాలనే ఉద్దేశ్యంతో గుమ్మలక్ష్మీపురం మండలం బాలేసు గ్రామంలో సోషల్ ట్రాన్స్ఫర్మేషన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సెంటర్ ఫర్ ఫైనాన్సియల్ లీటరసీ.కురుపాం కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా డిజిఏం జగదీష్ ముఖ్య అతిధిగా విచ్చేసారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల్లో ముఖ్యంగా గిరిజన ప్రాంతలలో ఉన్న ప్రజలకి బ్యాంకింగ్ సేవలు చేరువ అవ్వాలనే సదుద్దేశంతో ఈ అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశామని ప్రతీ ఒక్కరు బ్యాంకింగ్ సేవలు వినియోగించుకోవాలని ఆయన కోరారు.ఈ సందర్భంగా వారు అక్కడ ప్రజలకు గొడుగులు అందజేశారు. ముందు ముందు మరిన్ని కార్యక్రమాలు ఏర్పాటు చేస్తామని,గ్రామానికి అవసరమయ్యేవి తెలుసుకుని మా వంతు సహాయ సహకారాలు అందిస్తామని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమానికి సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్ఫర్మేషన్స్వచ్ఛంద సంస్థ పీడీ మరియు పీఎం ఆంజనేయులు,అశోక్, మరియు సిఎఫ్ఎల్ ప్రాజెక్ట్ జిల్లా సమన్వయ అధికారి ఫణికుమార్,కౌన్సిలర్స్ వినోద్, కిషోర్,బాలేసు గ్రామ విఓఏ రాజారావు,స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

## చిన రుషికొండలో.సుపరిపాలన





- తొలి అడుగు లో భాగంగా
- విద్యుత్ సమస్యకు నెలరోజుల్లో పరిష్కారం
- పెద్దిపాలెం ప్రజలకు గంటా హామీ

**,బిమిలి, పెన్ పవర్, జులై 03 :**పెద్దిపాలెం ప్రజలు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్య నెల రోజుల్లో పరిష్కారమవుతుందని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు హామీ ఇచ్చారు. సుపరిపాలన - తొలి అడుగు కార్యక్ర మంలో భాగంగా గురువారం పెద్దిపాలెంలో ఇంటింటికి వెళ్లి ప్రజలను కలుసుకున్నారు. విద్యుత్ ఫీడర్ పై వ్యవసాయ కనెక్షన్లు ఎక్కువ ఉన్నందున తరచూ విద్యుత్ సరఫరా నిలిచిపో తుందని స్థానికులు ఫిర్యాదు చేశారు. గతంలో ఎమ్మెల్యే సూచన మేరకు సమస్య పరిష్కారా నికి ఇప్పటికే చర్యలు చేపట్టామని విద్యుత్ శాఖ అధికారులు వెల్లడించారు. ఈ సమస్యను అధిగమించడానికి మొత్తం 700 విద్యుత్ స్తంభాలు వేయాల్సి ఉండగా, 350 వరకూ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. మిగిలిన స్థంభాలు వేయడం నెల రోజుల్లో పూర్తవుతుందన్నారు. అలాగే మచ్చవానిపాలెం - పెద్దిపాలెం రోడ్డు కావాలని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా, లేదా అనేది ఎమ్మెల్యే ఆరా తీశారు. అర్హతలున్నప్పటికీ సంక్షేమ పథకాలు అందడం లేదని చెప్పగా.. కొత్త పెన్షన్లు తదితర పథకాలకు ప్రభుత్వం ప్రకటించినప్పుడు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తాట్రాజు అప్పారావు, బి.ఆర్.బి. నాయుడు, సాయి గణేష్, సురేష్, చందక అప్పలరాజు, మీసాల సత్యనారాయణ, గాడు అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.చిన రుషికొండలో.

సుపరిపాలన - తొలి అడుగు లో భాగంగా భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు గురువా రం జీవీఎంసీ 8 వ వార్డు చిన రుషికొండలో పర్యటించారు. దెబ్బతిన్న రోడ్లు, కాలువలు పునర్నిర్మించాలని స్థానికులు ఎమ్మెల్యేను కోరారు. అలాగే మంచినీరు సన్న ధార వస్తుం డడం వల్ల ఇబ్బంది పడుతున్న విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లగా, కొత్త పైపులైన్ వేయాలని జీవీఎంసీ అధికారు లను ఆదేశించా రు. ప్రభుత్వ పథకాల విషయంలో చేసిన ఫిర్యాదులు పరిశీలించి చర్యలు తీసుకుంటాన ని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ లొడగల అప్పా రావు, చెట్టిపల్లి సన్యాసిరావు, సారిపల్లి శ్రీను, దొరబాబు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## జూలై 9న దేశవ్యాప్త సమ్మె: లేబర్ కోడ్స్ రద్దు కోసం సీఐటీయూ పిలుపు

**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, జూలై 3:**ప్రభుత్వం తీసుకొస్తున్న కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్స్ ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ జూలై 9న దేశవ్యాప్త కార్మిక, కర్షక, ఉద్యోగ సంఘాల సమ్మె నిర్వహించనున్నట్టు సీఐటీయూ ప్రకటించింది.ఈ మేరకు అల్లూరి జిల్లా సీఐటీయూ అధ్యక్షులు బోనంగి చిన్నయ్య పడాల్, జీకే వీధి మండల కార్యదర్శి గడుతురు సత్యనారాయణ పిలుపునిచ్చారు.జీకే వీధి మండల కేంద్రంలో సీఐటీయూ నాయకులు ఆటోల్లో స్టిక్కర్లు అతికించి సమ్మెకు ప్రచారం నిర్వహించారు. కార్మికులు, ఆటో డ్రైవర్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.మోదీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన లేబర్ కోడ్స్ పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసమే రూపొందించబడ్డాయని, ఇవి కార్మికుల హక్కులకు విరుద్ధమని నాయకులు విమర్శించారు. ఈ కోడ్స్ వల్ల పని గంటలు, సెలవులు, ఆరోగ్య భద్రత వంటి పలు కార్మిక హక్కులు తుంగలో తొక్కే ప్రమాదం ఉందని పేర్కొన్నారు.నాలుగు లేబర్ కోడ్స్ ను రద్దు చేయాలి.కనీస వేతనం రూ.26,000గా నిర్ణయించాలి.ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను నిలిపివేయాలి.కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ విధానాలను రద్దు చేయాలి.స్కీమ్ కార్మికులను క్రమబద్ధీకరించి కార్మికులుగా గుర్తించాలి.సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలి.పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి. ఈపిఎస్ కనీస పెన్షన్ రూ.9,000కు పెంచాలి.బిల్డింగ్ %డ% బీడి కార్మికుల సంక్షేమ పథకాలను పునరుద్ధరించాలి. కార్మిక సంక్షేమ నిధిని తిరిగి జమ చేయాలి.ముఠా,ఆటో కార్మికుల సంక్షేమ బోర్డులు ఏర్పాటు చేయాలి అని డిమాండ్ చేశారు ఈ దేశవ్యాప్తంగా జరుగుతున్న సమ్మెలో ప్రతి కార్మికుడు, ఉద్యోగి చొరవతో పాల్గొని తమ హక్కులను కాపాడుకోవాలని సీఐటీయూ నాయకులు పిలుపునిచ్చారు.



## పరశురాముని అవతారంలో శ్రీ జగన్నాథుడు.



**కురుపాం/ జియ్యమ్మవలస, పెన్ పవర్, జులై -03.** పార్వతీపురం మన్యం జిల్లా జిఎం వలస మండలం చిన మేరంగి గ్రామంలో. శ్రీ జగన్నాథ స్వామి రథయాత్ర మహోత్సవంలో భాగంగా గురువారం ఏడవ రోజుగుండిచ మండపంలో శ్రీ జగన్నాథ స్వామి పరశురాముని అవతారంలో దర్శనమిచ్చారు శ్రీ జగన్నాథ స్వామి రథయాత్ర మహోత్సవం ఏడు రోజులు పూర్తయిందని జులై 5వ తేదీన మారు రథయాత్ర జరుగుతుందని ఆలయ ప్రధాన పూజారి గిరిధర పాత్రో తెలిపారు రైతులు పంటలు బాగా పండాలని వర్షాలు సమృద్ధిగా కురవాలని తొమ్మిది రోజులు పాటు గుండు చ మండపం కు వెళ్లి శ్రీ జగన్నాథ స్వామిని దర్శించుకోవడం ఆనవాయితీగా వస్తుంది ప్రతిరోజు గుండిచా మండపానికి వెళ్లి వందలాది మంది భక్తులు శ్రీ జగన్నాథ స్వామిని దర్శించుకుంటున్నారు.

## ఘనంగా దాడి వీరభద్రరావు జన్మదిన వేడుకలు





**అనకాపల్లి, పెనపవర్, జులై 03:**మాజీ మంత్రివర్యులు శ్రీ దాడి వీరభద్రరావు జన్మదిన సందర్భంగా కసింకోట గ్రామం, బాలికోన్నత పాఠశాలలో తెదేపా నాయకులు వేగి పవన్ కుమార్ ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పదవ తరగతిలో పాఠశాలలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులు ప్రథమ స్థానం సాధించిన వారికి రూ. 5000, ద్వితీయ స్థానం సాధించిన ఇద్దరికీ వారికి రూ.3000 చొప్పున నగదు పురస్కారాలు అందజేయడం జరిగింది. అనంతరం కేకును కట్ చేసి విద్యార్థులకు పంచిపెట్టడం జరిగింది. ఈ కార్యక్రమంలో దాసరి బాబు, పెదపాటి కళ్యాణి,బొడ్డేడ బాలాజీ,వేగి వెంకట్రావు, దాడి కృష్ణ, పెంటకోట నాయుడు, దాడి రాము, బోబ్బరి రాము, చెవ్వేటి నాగరాజు, స్కూల్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్, హెచ్ఎం గారు తదితరులు పాల్గొన్నారు.

## 200 బైక్ల ర్యాలీ తో పి.వి.ఎన్ మాధవ్ కి ఘన స్వాగతం

- పారిశ్రామిక ప్రాంత బిజెపి నాయకులు



**ములగాడ ,పెన్ పవర్, జులై 03 :**బిజెపి రాష్ట్ర అధ్యక్షులుగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత విశాఖపట్నం విచ్చేసిన సందర్భంగా ఏర్పాటు నుంచి విశాఖ జిల్లా పార్టీ ఆఫీస్ వరకు రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్ కి ఘన స్వాగతం పలకడం జరిగింది, ముందు గా విశాఖ వెస్ట్ పారిశ్రామిక ప్రాంత బిజెపి నా యకులు హారతులు ఇచ్చి గజమాలవేసి స్వాగ తం కలవడం జరిగింది. ఈ యొక్క కార్యక్రమం లో జిల్లా ప్రధాన కార్యదర్శి పోలిమేర శ్రీనివాస రావు ,రాష్ట్ర ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షులు కొక్కి లిగడ్డ విజయబాబు మండల అధ్యక్షులు లక్క రాజు రామకృష్ణ తెప్పల సతీష్, అనిల్, కవులూ రి గురుమూర్తి, పొలిమేర హరిత, కొత్తలంక భువనేశ్వరి , మల్ల రవి పరిమి కృష్ణ, సతీష్, అధిక సంఖ్యలో బిజెపి నాయకులు కార్యకర్తలు జరిగింది, 200 బైక్లతో ర్యాలీగా వెళ్లి స్వాగతం చెప్పడం జరిగింది

## రాత్రీ పూట తిరిగితే కేసులు నమోదు చేస్తాం

- ముంచంగిపుట్టు ఎస్ఐ జే రామకృష్ణ.



**ముంచంగిపుట్టు, పెన్ పవర్, జూలై 03.**మండల కేంద్రంలో రాత్రి 11 గంటలు దాటిన తరువాత రోడ్ల మీద అనవసరంగా ఎవరైనా తిరుగుతూ గస్తీ పోలీసులకు కనబడితే పోలీసు కేసులు తప్పవని ఎస్సై జె రామకృష్ణ అన్నారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. మండల కేంద్రంలో రాత్రి11 గంటలు దాటిన తరువాత అనవసరంగా ఎవరు రోడ్లపై సంచరించరాదని, ప్రస్తుతం మండలంలో జరుగుతున్న దొంగతనాలు ఇతరేతర సంఘటనలు జరుగుతున్న దృష్ట్యా రాత్రి వేళలో పోలీస్ గస్తీతో పాటు పోలీస్ పెట్రోలింగ్ నిర్వహించడం జరుగుతుందన్నారు. మండల ప్రజలంతా గమనించి రాత్రి 11 గంటల తరువాత అత్యవసరం అయితే తప్ప రోడ్లమీదికి ఎవరు సంచరించరాదన్నారు. అనవసరంగా సంచరిస్తూ పోలీసులకు పట్టుబడితే వాళ్లను గంజాయి పైలెట్లుగా లేదా దొంగలుగా అనుమానించాల్సి ఉంటుందని, ఈ విషయాన్ని మండల ప్రజలందరూ గమనించాలని ఆయన పేర్కొన్నారు. మండల కేంద్రంలో ఇటీవల మూడు షాపుల్లో దొంగలు చొరబడి హల్ చల్ చేశారని, పనిలేకుండా రాత్రి సమయంలో అనవసరంగా తిరుగుతుంటే దొంగలుగా పరిగణిస్తామని ఆయన హెచ్చరించారు.

# పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో క్రైస్తవ దినోత్సవం.

**అరకులోయ పెన్ పవర్ 3 :**యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్స్ ఆధ్వర్యంలో భారతీయ క్రైస్తవ దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. అరకులోయ మండల కేంద్రంలో భారతీయ క్రైస్తవ దినోత్సవ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. రెవ.బి.ఇ.సంజీవ్ కుమార్ అధ్యక్షతన అరకులోయ"జీసస్ ప్రేయర్ హౌస్ లో ఎంతో సంతోషకరముగా వేడుకలు నిర్వహించారు. ప్రెసిడెంట్ రెవ.ప్రసాద్ పాల్ బిషప్ విజయ్ డేనియల్ మూడీ, రెవ.బి.జాన్,.వాలసి.బాబురావు, ఎంపీటీసీ ఆనంద్ ప్రజలకు శు భాకాంక్షలు తెలియచేశారు. క్రీ.శ. 52 జూలై 3 న భారతదేశమునకు యేసుక్రీస్తు సువార్తను తీసుకువచ్చిన యేసుక్రీస్తు శిష్యుడు తోమాను జ్ఞాపకం చేసుకొనుట ఆశీర్వాదకరమని రెవ.బి.ఇ.సంజీవ్ కుమార్ జనరల్ సెక్రటరీ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. భారతీయ క్రైస్తవ దినోత్సవ వేడుకలలో యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు పాస్టర్.ఏలీయా రాజు, ఎలీషా, శ్యామల రావు, కన్వీనర్ బాబురావు, ట్రజరర్ శామ్యూల్ పాస్టర్, క్రైస్తవ సంఘ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.



# 20 లీటర్ల నాటు సారా స్వాధీనం..



**ఒకరు అరెస్ట్....**

**కురుపాం/ జియ్యమ్మ వలస, పెన్ పవర్, జులై -3**

జియమ్మవలస మండలం గడసంగిపురం లో కురుపాం ప్రోహిబిషన్ %డ% ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ శ్రీ పి. శ్రీనివాసరావు వారి సిబ్బంది తో కలిసి అక్రమంగా నాటు సారా అమ్మకం గూర్చి వచ్చిన సమాచారం లో భాగంగా దాడులు చేసి నాటు సారాయా అమ్మకం చేస్తున్న గడసంగి పురం కు చెందిన గరుగు బిల్లీ దమయంతి ని గురువారం అదుపులోకి తీసుకొని ఆమె వద్దనుండి 20 లీటర్ల నాటు సారా ను స్వాధీనం చేసుకొని , ఆమెకి క నాటు సారా సరఫరా చేసిన చినమేరంగి చెందిన వ్యక్తి పై కూడా కేసు నమోదు చేశామని త్వరలోనే అరెస్టు చేస్తామని తెలిపారు.దమయంతి ను అరెస్ట్ చేసి రిమాండ్ నిమిత్తము కోర్టు లో హాజరు పరిచా మన్నారు.

ఈ సందర్భంగా సీఐ పి. శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామలలో తరచుగా నాటుసారా తయారీ, రవాణా,అమ్మకాలు చేస్తు పట్టుబడుతున్న వారిపై మరియు నాటు సారాయా వ్యాపారానికి పరోక్షంగా సహకరిస్తున్న వారిని స్పెషల్ స్క్వాడ్ ల సహాయంతో ట్రాక్ చేస్తున్నామని అటువంటి వారు మరలా పట్టుబడితే అటువంటి వారిపై పీడి చట్టం ప్రయోగిస్తామని హెచ్చరించారు.

. ఈ దాడుల్లో ఎక్సైజ్ సబ్ ఇన్స్పెక్టర్ జె. రాజశేఖర్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# డైవర్షన్ పాలిటిక్స్ చంద్రబాబు



- సింగయ్య మృతిపై శవ రాజకీయాలు
- చంద్రబాబు శవరాజకీయాలు చేయడం మానుకోవాలి
- వైయస్సార్సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జూపూడి ప్రభాకర్‌రావు ఆగ్రహం
- విశాఖలోని పార్టీ సిటీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన జూపూడి ప్రభాకర్‌రావు
- సింగయ్య మరణంపైన చంద్రబాబు విషం కక్కుతున్నాడు
- చనిపోయిన వ్యక్తి గురించి నోటికొచ్చినట్టు మాట్లాడటం తగదు
- సింగయ్య భార్య అనుమానాలకు ప్రభుత్వం సమాధానం చెప్పాలి
- వైయస్ఆర్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జూపూడి ప్రభాకర్‌రావు డిమాండ్

**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్, విశాఖపట్నం, జులై 03 :**స్వార్ధ రాజకీయ ప్రయోజనాల కోసం సీఎం చంద్రబాబు శవరాజకీయాలతో దిగజారిపోతు న్నారని వైయస్ఆర్‌సీపీ ప్రధాన కార్యదర్శి జూపూడి ప్రభాకర్‌రావు మండిపడ్డారు. విశాఖప ట్నం వైయస్ఆర్‌సీపీ నగర పార్టీ కార్యాలయం లో మీడియాతో మాట్లాడుతూ సత్తెనపల్లిలో చనిపోయిన దళితుడు సింగయ్యను కించపరిచే లా చంద్రబాబు చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. దళితుల పట్ల చంద్రబాబుకు ఉన్న చులకనభావంకు ఈ వ్యాఖ్యలు అద్దం పడుతున్నాయని అన్నారు. కనీసం చనిపోయిన వారి పట్ల ఒక మనిషిగా చూపించాల్సిన గౌరవాన్ని కూడా చూపించలేని సంస్కారం చంద్రబాబు సొంతమని మండిప డ్డారు. ఇంకా ఆయనేమన్నారంటే.డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగంగా చంద్రబాబు సింగయ్య మృతిపై శవ రాజకీయాలు చేస్తున్నారు. ప్రతిపక్ష నేత వైయస్ జగన్ సత్తెనపల్లి పర్యటనలో సింగయ్య అనే వైయస్సార్సీపీ కార్యకర్త ప్రమాదవశాత్తు మరణిస్తే దానిపై చంద్రబాబు కుట్రలకు తెర తీశారు. చనిపోయిన వ్యక్తిపట్ల కానీ, ఆ దళిత కుటుంబంపై గానీ కనీస సానుభూతి, గౌరవం లేకుండా చంద్రబాబు నోటికొచ్చినట్టు మాట్లాడుతున్నాడు. సింగయ్య మరణంపై ఆయన భార్య లూర్దు మేరీ అనుమానాలు వ్యక్తం చేస్తే ప్రభుత్వం సమాధానాలు చెప్పుకోలేని పరిస్థితుల్లోకి వెళ్లిపోయింది. ప్రమాదం జరిగిన తర్వాత కూడా బాగానే మాట్లాడిన వ్యక్తి ఎలా మరణించాడని ప్రశ్నిస్తోంది. మంత్రి నారా లోకేష్ తన ఇంటికి మనుషులను పంపించి బెదిరింపులకు పాల్పడుతున్నారని మీడియా ఎదుట ఆవేదన వ్యక్తం చేసింది. ప్రమాదం విషయంలోనూ గుంటూరు ఎస్పీ రెండుసార్లు పరస్పర భిన్నమైన ప్రకటనలు చేశారు. వాటన్నింటికీ సమాధానం చెప్పుకోలేని చంద్రబాబు డైవర్షన్ పాలిటిక్స్‌కి తెరదీశారు. వైయస్ జగన్ ని నెల్లూరు పర్యట నకు వెళ్లనీయకుండా అనుమతుల పేరుతో ఇబ్బందులు సృష్టించారు. ప్రతినెలా ఇచ్చే పింఛన్‌కు అంత పబ్లిసిటీనా? నాడు వైయస్ జగన్ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తే, చంద్రబాబు ప్రతినెలా రూ. 4 వేల పింఛన్ ఇవ్వడం కోసం పబ్లిసిటీ పేరుతో రూ. కోట్లు ప్రజాధనం వృథా చేస్తున్నాడు. సూపర్ సిక్స్ హామీలన్నీ గాలికొదిలేయడంతో నెలకోసారి ఇచ్చే పింఛన్ పంపిణీకి మూడు పార్టీలు పోటీ పడుతున్నాయి. ప్రభుత్వ వసతి గృహాల్లో బొద్దింకలతో భోజనం పెడుతున్నారు. సాక్షాత్తు హెూంమంత్రి తినే అన్నంలోనే బొద్దింకలు కనిపిం చినా ఈ ప్రభుత్వంలో కదలిక రావడం లేదు. గిట్టుబాటు ధరలు లేక రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నా వారిని ఆదుకునే ప్రయత్నం చేయడం లేదు. విద్య వైద్య రంగాలను నిర్వీ ర్యం చేశారు. కూటమి ఏడాది పాలనలోనే అన్ని వ్యవస్థలూ భ్రష్టుపట్టిపోయాయి. వైయస్ జగన్ పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తే ఓర్చుకోలేక వాటిని కూడా నిలేపేసిన దుర్మార్గ ప్రభుత్వానికి మహిళలనే బుద్ధిచెప్పే రోజులు త్వరలోనే రాబోతున్నాయి.

ఈ కార్యక్రమంలో పార్టీ కార్యాలయం లో పర్యవేక్షకులు రవి రెడ్డి, రాష్ట్ర ఎస్.సి విభాగం ఉపాధ్యక్షులు రెయ్యి వెంకట రమణ , పార్టీ ముఖ్యనాయుకులు అల్లంపల్లి రాజ బాబు , పిలా వెంకట లక్ష్మి , ద్రోణంరాజు శ్రీ వాత్సవ్ , కార్పొరేటర్లు శేశికల అనుబంధం విభాగం అధ్యక్షులు బోని శివ రామ కృష్ణ , సనపల రవింద్ర భరత్ , పులగం కొండ రెడ్డి , లక్ష్మణ , జిల్లా అధికార ప్రతినిధి మల్లేశ్వరి, పార్టీ నాయుకులు శేఖర్ , సాగర్, సూర్య , మహేష్ తదితరులు పాల్గొన్నారు

## యస్ సొసైటీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగ్ రహిత దినోత్సవం.....




**కురుపాం, పెన్ పవర్, జులై -3:**యస్ సొసైటీ సహకారంతో తయారు చేసిన క్లాత్ బ్యాగ్ (గుడ్డ సంచులు) కురుపాం తహసీల్దార్ జయ గారి చేతుల మీదుగా బియ్యల వలస పంచాయితీ సర్పంచ్ పువ్వుల.ఆజ్జరి కి, తహసీల్దార్ కార్యాలయం సిబ్బంది మరియు కార్యాల యానికి వచ్చిన ప్రజలకు అందించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దర్ గారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వినియోగానికి స్వస్తి చెప్పి గుడ్డ మరియు జ్యూట్ తో తయారు చేసిన బ్యాగ్ లు వాడటం ద్వారా పర్యావరణం పరిరక్షించి ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి కృషి చేయాలని కోరారు . యస్ సొసైటీ కార్యదర్శి షేక్ గౌస్ మాట్లాడుతూ ఆదివాసీ ప్రాంతాల్లో ప్లాస్టిక్ వినియోగం పై సరైన అవగాహన లేక ప్లాస్టిక్ వినియోగం చాలా ఎక్కువ గా ఉంది కావున బియ్యాలా వలస, గోటివాడ మరియు ఆర్.కే. బాయి పంచాయితీల్లో ముందుగా ప్లాస్టిక్ వ్యతిరేకంగా అవగాహన కల్పించి ప్రతి ఒక్కరూ క్లాత్ బ్యాగ్ వినియో గించేలా ప్రోత్సహిస్తున్నాము అని చెప్పారు. ఈ కార్యక్రమంలో తహీల్దార్ కార్యాలయ సిబ్బంది మరియు బియ్యాలా వలస పంచాయితీ మాజీ సర్పంచ్ పువ్వుల పత్తి పాల్గొన్నారు.

# రాయితీపై విత్తనాలు పంపిణీ కార్యక్రమం.

ప్రభుత్వ విప్ %డ% ఎమ్మెల్యే.తోయక్క జగదీశ్వరి.





**గుమ్మలక్ష్మీపురం జులై 03. పెన్ పవర్.** మండల కేంద్రంలో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో వ్యవసాయ శాఖ వారి ఆధ్వర్యంలో 100% రాయితీతో కందులు మరియు రాగులు విత్తనాలను ప్రభుత్వ విప్ మరియు కురుపాం శాసనసభ్యురాలు తోయక జగదీశ్వరి రైతులకు విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చినటువంటి రాయితీల అన్ని రకాల విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె రైతులకు సూచించారు.ఇదివరకు కురుపాం ఏడిఏ రెడ్డి అన్నపూర్ణ,గుమ్మలక్ష్మీపురం, గరుగుబిల్లి, జియ్యమ్మవలస మండలాల ఏవో లు పల్లేరుక శంకరరావు,జ్యోత్స్న, భారతి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది.విత్తనాలు పంపిణీ కార్యక్రమంలో గుమ్మలక్ష్మీపురం మండల పార్టీ అధ్యక్షులు అడ్డాకుల నరేష్, మాజీ ఏఎంసీ చైర్మన్ కోలా రంజిత్ కుమార్,కొమరాడ మండల రైతు అధ్యక్షులు బత్తిలి శ్రీను,మూడు మండలాల ఏవోలు, వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు,తదితరులు ఉన్నారు.

## వై ఎస్ ఆర్ పార్టీ విస్తృత స్థాయి సమావేశాన్ని జయప్రదం చేయండి.

:జిల్లా అధ్యక్షుడు పరీక్షితరాజు పిలుపు.



**కురుపాం / జియ్యమ్మ వలస , పెన్ పవర్, జులై -3:**ఈనెల 5న వై ఎస్ ఆర్ పార్టీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వై ఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పార్వతీపురం మన్యం జిల్లా వై ఎస్ ఆర్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం జరుగుతుందని మన్యం జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షితరాజు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా శాసన మండలి ప్రతిపక్ష నేత,మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ పార్టీ రీజినల్ కోఆర్డినేర్,మాజీ మంత్రి కురసాల కన్నబాబు, మాజీ మంత్రులు, పార్లమెంట్ పరిశీలకులు, ఎంపీ, ఎమ్మెల్సీ,నియోజకవర్గ సమన్వయకర్తలు మాజీ ఎమ్మెల్యే లు ముఖ్యనాయకులు హాజరవుతారని కావున శనివారం పార్వతీపురం సౌందర్య థియేటర్ దగ్గరలో గల రాయల్ కన్వెన్షన్ హాల్లో ఉదయం 10 గంటలకు సమావేశం నిర్వహిస్తున్నందున పార్టీ శ్రేణులు,మండల పార్టీ అధ్యక్షులు,జిల్లా పార్టీ కార్యవర్గ సభ్యులు,జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులు, నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షులు,రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గం నుండి మండల స్థాయి పార్టీ కమిటీల వరకు వివిధ హెూదాలో గల సభ్యులు , ఎంపిపి లు, జడ్పీటీసీ లు, మాజీ కార్పొరేషన్ చైర్మన్ లు, మాజీ డిసిసిబి,మాజీ డిసిఎంఎస్ చైర్మన్లు, మున్సిపల్ చైర్మన్లు,కార్పొరేటర్ లు,కౌన్సిలర్ లు, సర్పంచ్ లు , ఎంపిటిసి లు మరియు పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

# జగన్ కు Z+ భద్రత ఉన్నట్లా..? లేనట్లా..?



**హైదరాబాద్ పెన్ పవర్:** మాజీ సీఎం వైఎస్ జగన్మోహనరెడ్డికి Z+ భద్రత కల్పించడం లేదని, ఆయనకు Z+ భద్రత ఉన్నప్పటికీ తగిన రక్షణ చర్యలు తీసుకోవడం లేదని వైసీపీ దాఖలు చేసిన పిటిషన్ పై హైకోర్టులో విచారణ జరిగింది. ఈ నెల 3 గురువారం జగన్ నెల్లూరు పర్యటనకు వెళ్లాల్సివుంది. అయితే ఆయన పర్యటనకు పోలీసులు సహకరించడం లేదని, Z+ భద్రత కల్పించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ వైసీపీ నేతలు లేళ్ల అప్పిరెడ్డి, చంద్రశేఖరరెడ్డి హైకోర్టులో పిటిషన్ వేశారు. దీనిపై విచారణ జరిగింది. అయితే Z+ భద్రతపై కేంద్రం జారీ చేసిన మార్గదర్శకాలను ఇవ్వాలని కోరడంతో విచారణ వాయిదా పడింది.

మాజీ ముఖ్యమంత్రి హోదాలో జగన్ కు ప్రస్తుతం Z+భద్రత కల్పిస్తున్నట్లు ప్రభుత్వం వాదిస్తోంది. అయితే పేరుకు Z+ భద్రత అంటున్నప్పటికీ తగిన రక్షణ చర్యలు తీసుకోవడం లేదని వైసీపీ ఆరోపిస్తోంది. ప్రధానంగా రోప్ పార్టీని నియమించకపోవడం వల్ల జగన్ పర్యటనల్లో ప్రమాదాలు జరుగుతున్నట్లు కోర్టు దృష్టికి తీసుకువెళ్లింది. గత నెల 18న మాజీ సీఎం రెంటపాళ్ల పర్యటనకు వెళ్లగా సింగయ్య అనే కార్యకర్త కారు కింద పడి మరణించాడని, రోప్ పార్టీ లేకపోవడం వల్లే ఈ తరహా ప్రమాదాలు జరుగుతున్నట్లు వైసీపీ న్యాయవాదులు కోర్టు దృష్టికి తెచ్చారు.

ఇదే సమయంలో నెల్లూరు పర్యటనకు వెళతానంటే హెలిపాడ్ ఏర్పాటు చేయడంలో ప్రభుత్వం సహకరించడం లేదని న్యాయవాదులు కోర్టు దృష్టికి తీసుకువెళ్లారు. అయితే జగన్ పర్యటన ఇప్పటికే వాయిదా వేయడం వల్ల పిటిషన్ నిరర్థకమైందని విచారించాల్సిన అవసరం లేదని ప్రభుత్వ న్యాయవాదులు వాదించారు. అయితే Z+ భద్రత నిరాకరించడం వల్లే జగన్ పర్యటన వాయిదా పడిందని, పిటిషన్ పై విచారణ జరిపి తగిన ఆదేశాలివ్వాలని వైసీపీ తరఫు న్యాయవాదులు కోరారు.

దీంతో కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలను సమర్పించాలని కోర్టు ఆదేశించింది. కేంద్రం మార్గదర్శకాల ప్రకారం మాజీ ముఖ్యమంత్రికి Z+ సెక్యూరిటీ ఇస్తుంది, లేనిదీ స్పష్టమవుతుంది. ఎన్నికల్లో ఓడిపోయిన నుంచి తన భద్రతపై ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని జగన్ ఆరోపిస్తున్నారు. గుంటూరు మిర్చియార్డుకు వెళ్లిన సమయంలో ఆయనకు ఉన్న ప్రత్యేక భద్రత ఏర్పాట్లను ఉపసంహరించుకున్నారు. అప్పట్లో ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున జగన్ పర్యటనకు అనుమతి లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. అయినప్పటికీ ఆయన గుంటూరు పర్యటనకు వెళ్లడంతో భద్రత తగ్గించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో వైసీపీ హైకోర్టుకు వెళ్లడంతో న్యాయస్థానం తీర్పుపై ఉత్కంఠ నెలకొంది.

# కవిత ఈసారి ఇంకొక సంచనల స్టేట్మెంట్...సీఎం అవుతా !



**హైదరాబాద్ పెన్ పవర్:** సీఎం అవుతా. నిజానికి ఇది ఒక రాజకీయ నాయకునికి జీవిత కాలం లక్ష్యం. సగటు రాజకీయ నాయకుడు ఎమ్మెల్యే దగ్గరే ఆగిపోతారు. మరి కొద్దిగా ఆశలు పెంచుకున్న వారు అయితే మంత్రి అయితే చాలు ఈ జన్మ సార్థకం అని భావిస్తారు. అయితే కేసీఆర్ లాంటి పవర్ ఫుల్ లీడర్ వారసురాలు కాబట్టి కవిత ఏకంగా సీఎం అవుతాను అని సంచలన ప్రకటన చేశారు. ఇటీవల కాలంలో ఆమె వరుసగా సంచలన స్టేట్మెంట్స్ ఇస్తున్నారు.

ఆ మధ్య తన తండ్రికి లేఖ రాశారు. అందులో పాతికేళ్ళ బీఆర్ఎస్ సభలో కేసీఆర్ మాట్లాడిన కొన్ని అంశాల మీద మాట్లాడని మరి కొన్ని అంశాల మీద కవిత తనదైన శైలిలో విమర్శనాత్మక పంథాలో విశ్లేషించారు అది బాహాటం అయి ఎంత రచ్చ రేపిందో అందరికీ తెలిసిందే. అయితే కవిత ఆ లేఖ తాను రాయలేదు అని ఖండించకపోవడమే ఆమెలోని ఆత్మబలాన్ని తెలియచేస్తుంది.అంతే కాదు తాను ఇలాంటి లేఖలు ఎపుడూ రాస్తూ ఉంటాను అని సమర్థించుకున్నారు. అందులో తప్పేమీ లేదని కూడా చెప్పుకున్నారు. పార్టీలో విషయాలను ఎవరో ఒకరు అధినాయకత్వానికి తెలియచేయకపోతే ఎలా అని కూడా అన్నారు. మరో వైపు చూస్తే కవిత ఆ తరువాత తెలంగాణా జాగృతి వేదిక మీద నుంచే ఎక్కువగా కనిపించారు. ఇక లేటెస్ట్ గా ఆమె ఒక ఇంటర్వ్యూ ఇస్తూ అందులో బీఆర్ఎస్ తన సొంత పార్టీ. తాను కూడా పార్టీ నిర్మాణంలో చేయి వేశాను అని క్లెయిం చేసుకున్నారు.అందువల్ల తాను ఇప్పటికీ ఎప్పటికీ బీఆర్ఎస్ నాయకురాలినే తన సొంత పార్టీ అదే అన్నారు. దానికి పొడిగింపుగానే ఆమె సీఎం అవుతాను అని కూడా చెప్పారు. ఇలా ఆమె సంచలన వ్యాఖ్యలు కంటిన్యూ అవుతూనే ఉన్నాయి. ఇక్కడ మరో ముచ్చట చెప్పాలీ అంటే కవిత ఇదే ఇంటర్వ్యూలో పరోక్షంగా కవిత తన తండ్రి కేసీఆర్ మీద విమర్శలు చేసినట్లుగా కనిపిస్తోంది.నిజామాబాద్ అభివృద్ధి కోసం స్పెషల్ డెవలప్మెంట్ ఫండ్స్ ని ఇవ్వమని తాను కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నపుడు కోరాను అని ఆమె ఫ్లాష్ బ్యాక్ స్టోరీని రివీల్ చేశారు. అయితే తనకు ఆ నిధులు ఆయన ఇవ్వలేదని అన్నారు. మరి ఎందుకు ఇవ్వలేదో అని కూడా అన్నారు. అంటే ఆ విధంగా ఆమె చెబుతూ కేసీఆర్ నిధులు ఇవ్వలేదని ఒక సగటు ప్రజా ప్రతినిధి చేసినట్లుగానే విమర్శించారు. ఇది తన తండి మీద ఆమె బాహాటంగా చేసిన మరో విమర్శగానే అంతా చూస్తున్నారు.అంటే కవిత తన తండ్రి కేసీఆర్ తన విషయంలో అవలంబిస్తున్న వివక్ష కావచ్చు ఉదాశీనత కావచ్చు అది ఇప్పటిది కాదని చాలా కాలంగా ఉందని చెప్పదలచారా అన్నది కూడా చర్చకు వస్తోంది. అదే కేసీఆర్ ప్రభుత్వంలో ఆమె సోదరుడు కేటీఆర్ మంత్రిగా ఉన్నారు. ఇక బంధువు హరీష్ రావు మరో మంత్రిగా ఉన్నారు. ఎమ్మెల్సీగా ఉన్న కవితను మంత్రి పదవి కావాలని ఉందని అప్పట్లోనే ప్రచారం సాగింది. అందరికీ పదవులు ఇస్తే పూర్తి స్థాయిలో కుటుంబ పార్టీగా విమర్శలు రావచ్చు అని భావించవచ్చు అని అనుకున్నారు.

మరి ఆ విషయం అలా ఉంచితే నియోజకవర్గం అభివృద్ధి కోసం నిధులు ఇవ్వవచ్చు కదా అది చేతిలో ఉన్న పనే కదా దాని వల్ల కవిత 2014లో తొలిసారి ఎంపీగా గెలిచిన నిజామాబాద్ నుంచి మళ్లీ గెలిచేందుకు ఆస్కారం ఉండేది కదా అన్న చర్చ కూడా ఉంది. అయితే కవిత ఎపుడైతే 2019 ఎన్నికల్లో ఓటమి పాలు అయ్యారో ఆనాటి నుంచి ఆమెకు అక్కడ పట్టు పెద్దగా లేదని కేసీఆర్ భావించారా అన్నది కూడా చర్చగా ఉంది. అందుకే ఆమెకు ఎమ్మెల్సీ పదవిని ఇచ్చి అక్కడికి పరిమితం చేశారా దాంతోనేనా ఆమెకు అసంతృప్తి కలిగిందా అన్నది కూడా అంతా అనుకునే మాట.

అయితే కవిత మాత్రం తన పొలిటికల్ ఆశలను ఆకాంక్షలను ఎక్కడా దాచుకోవడం లేదు అయితే తాను వెళ్లే దారిలో సరైన ప్రోత్సాహం ఏదీ కేసీఆర్ నుంచి పెద్దగా దక్కలేదని ఆమె చెప్పదలచుకున్నారా అందుకేనా స్పెషల్ డెవలప్మెంట్ ఫండ్స్ ఇవ్వలేదు అని ఇన్నాళ్ళ తరువాత ఇంటర్వ్యూ వేదికగా బయట పెట్టారా అన్న చర్చ సాగుతోంది. ఏది ఏమైనా కవిత ఇదే ఇంటర్వ్యూలో మరో రెండు మాటలు చెప్పారు.

తన కంటే తన భర్త అంటే కేసీఆర్ కి చాలా ఇష్టమని అన్నారు. ఇక తనకు కేసీఆర్ కంటే తన సోదరుడి కేటీఆర్ తోనే మంచి సాన్నిహిత్యం ఉంది అన్నారు. అంటే ఏదో తెలియని గ్యాప్ అయితే ఉందని చెప్పదలచారా అన్నది కూడా ఉంది ఇవన్నీ చెబుతూనే ఆమె మరో మాట కూడా అన్నారు. బీఆర్ఎస్ లో కేసీఅర్ వన్ అండ్ ఓన్లీ లీడర్ అని. ఆయన స్థాయిలో మరో నాయకత్వం ఎదగలేదని చెబుతూ సోదరుడి మీద కామెంట్స్ చేశారా అన్నది చర్చగా ఉంది. ఇవన్నీ పక్కన పెడితే కవిత మాత్రం తన రాజకీయ వాటా బీఆర్ స్ లో తేల్చుకునే విషయంలో స్పష్టంగానే ఉన్నారు అన్నది ఆమె వ్యాఖ్యల ద్వారా అర్థం అవుతోంది అన్నది ఒక విశ్లేషణగా ఉంది.

# ఆఖరి గంట పోలింగ్.. వైసీపీ అనుమానాలపై ఈసీ ఏం చెప్పిందంటే..?



**హైదరాబాద్ పెన్ పవర్:** గత ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో చివరి గంటపాటు జరిగిన పోలింగ్ పై వైసీపీ లేవనెత్తిన అనుమానాలపై ఈసీ వివరణ ఇచ్చింది. ఆఖరి గంటపాటు పోలింగ్ శాతం అనూహ్యంగా పెరగడంపై తమకు సందేహాలు ఉన్నట్లు ఎన్నికల ఫలితాలు విడుదలైన తర్వాత కేంద్ర ఎన్నికల సంఘానికి వైసీపీ ఫిర్యాదు చేసింది. వైసీపీ లేవనెత్తిన సందేహాలను నివృత్తి చేసేందుకు ఆ పార్టీ నేతలను ఈసీ ఆహ్వానించింది. దీంతో ఎంపీలు మిథున్ రెడ్డి, వైవీ సుబ్బారెడ్డి, మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ తోపాటు మరికొందరు వైసీపీ నేతలు ఢిల్లీలో ఎన్నికల కమిషన్ కార్యాలయానికి వెళ్లారు.

ఈసీ ఆహ్వానం మేరకు ఈసీ కార్యాలయానికి వెళ్లిన వైసీపీ నేతలు పలు కీలక అంశాలపై తమ అభ్యంతరాలను తెలియజేశారు. ఈసీతో భేటీ అనంతరం ఆ వివరాలను వైసీపీ రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి మీడియాకు వెల్లడించారు. ఎన్నికల్లో చివరి గంట ఆకస్మాత్తుగా పోలింగ్ శాతం పెరగడం, అసాధారణంగా ఓటర్లు పెరగడంపై ఈసీకి ఫిర్యాదు చేసినట్లు సుబ్బారెడ్డి తెలిపారు. ఈవీఎంల పనితీరుపై తమకు అనుమానాలు ఉన్నట్లు ఈసీ దృష్టికి తీసుకువెళ్లినట్లు చెప్పారు. కొన్ని నియోజకవర్గాల్లో ఈవీఎంల్లో నమోదైన ఓట్లకు వీవీ ప్యాట్ల ప్రింట్లకు తేడా ఉన్నదని, వాటిని సరిపోల్చి చూడాలని ఈసీని కోరినట్లు సుబ్బారెడ్డి చెప్పారు.

ఓటర్ల జాబితా, పోలింగ్ సరళిపైనా చర్చించామని వైసీపీ నేతలు తెలిపారు. ప్రధానంగా గత ఎన్నికల్లో సాయంత్రం 6 గంటల తర్వాత పెద్ద ఎత్తున పోలింగ్ నమోదైందని, ఆ తర్వాత జరిగిన పోలింగ్ లో దాదాపు 50 లక్షల ఓట్లు పోలయ్యాయి. దీనిపై విచారణ జరగాలని వైసీపీ కోరుకుంటున్నట్లు చెప్పారు. విజయనగరం పార్లమెంట్ నియోజకవర్గంలో ఈవీఎం ఓట్లు, వీవీ ప్యాట్ స్లిప్పులను కంపారిజన్ చేయమని కోరితే, అలా కుదరదని ఈసీ తేల్చేసినట్లు సుబ్బారెడ్డి వివరించారు. పోలింగులో పారదర్శకత లేదని వ్యాఖ్యానించారు. అందుకే వచ్చే ఎన్నికలు బ్యాలెట్ విధానంలో జరగాలని తాము కోరుకుంటున్నట్లు తెలిపారు.బిహార్ తరహాలో ఏపీలో కూడా స్పెషల్ ఇంటెన్సిఫై రివిజన్ చేయాలని కోరగా, అందుకు ఈసీ అంగీకరించినట్లు వైసీపీ నేతలు చెప్పారు. రాయచోటిలో ఓటర్ల సంఖ్య గణనీయంగా పెరిగిందని, హిందుపురంలో 38వ పోలింగు బూత్ లో అసెంబ్లీ, పార్లమెంటు ఓట్లకు వ్యత్యాసం ఉన్నట్లు ఈసీకి ఫిర్యాదు చేశామన్నారు. ఎన్నికలు పారదర్శకంగా జరగాల్సిన అవసరం ఉందని, అభివృద్ధి చెందిన దేశాల్లో బ్యాలెట్ విధానమే అమలు అవుతోందని చెప్పారు.

# అమెరికా వెళ్లే భారతీయ విద్యార్థులకు ఉత్తమ విమాన ఎంపికలు ఇవే!



**హైదరాబాద్ పెన్ పవర్:** అమెరికాకు మొదటిసారి వెళ్ళే విద్యార్థులకు వీసా జాప్యం, బడ్జెట్, సామాను పరిమితులు వంటివి సాధారణ సమస్యలు. అయితే ఖతర్ ఎయిర్‌వేస్, ఎమిరేట్స్, ఎతిహాద్ వంటి ప్రముఖ విమానయాన సంస్థలు విద్యార్థుల కోసం ప్రత్యేక ఆఫర్‌లు అందిస్తున్నాయి. ఈ ఆఫర్‌లను రాయితీలు, షెడ్యూల్ సౌలభ్యం, ప్రయాణ సమయం, సామాను పరిమితుల ఆధారంగా ఎంపిక చేసుకోవచ్చు.

**ఎతిహాద్ ఎయిర్‌వేస్: సామానుకు ఉత్తమం!**

విద్యార్థులకు ఎతిహాద్ ఎయిర్‌వేస్ చాలా అనుకూలంగా ఉంటుంది. ఎకానమీ క్లాస్‌లో రెండు 23 కిలోల బ్యాగులను అనుమతిస్తుంది. ఇది పుస్తకాలు, గాడ్జెట్‌లు, దుస్తులు తీసుకెళ్లే విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుంది. కొన్ని రూట్లలో అదనంగా 10 కిలోల సామాను కూడా అనుమతిస్తుంది, అయితే ఇది అమెరికా/కెనడా రూట్‌లకు వర్తించదు.

**ఎమిరేట్స్ ఎయిర్‌వేస్: ప్రామాణిక అనుమతులు!**

ఎమిరేట్స్ సాధారణంగా 30-35 కిలోల సామానును అనుమతిస్తుంది. కొన్ని ప్రత్యేక రూట్లలో ఒక అదనపు బ్యాగ్ లేదా 10 కిలోల అదనపు సామాను కూడా అనుమతించవచ్చు. కానీ అమెరికా/కెనడా రూట్‌లకు మాత్రం ప్రామాణిక అనుమతులే వర్తిస్తాయి.

**ఖతర్ ఎయిర్‌వేస్: అదనపు సౌలభ్యం!**

ఖతర్ ఎయిర్‌వేస్ విద్యార్థులకు 10 కిలోల అదనపు సామాను లేదా అదనపు బ్యాగ్‌ను అనుమతిస్తుంది. అయితే ఇది పూర్తిగా రూట్‌ను బట్టి మారుతుంది. అలాగే ఖతర్ ద్వారా వేగవంతమైన కనెక్షన్‌లు లభిస్తాయి.

**రాయితీలు - టికెట్ ధరలపై తగ్గింపులు**

విమానయాన సంస్థలు విద్యార్థులకు అందిస్తున్న డిస్కౌంట్‌లు ఇవి:

**ఎమిరేట్స్:** ఎకానమీ క్లాస్ టికెట్‌పై 10% రాయితీ, బిజినెస్ క్లాస్‌పై 5% రాయితీ అందిస్తుంది. ఇది మార్చి 31, 2026 వరకు అందుబాటులో ఉంటుంది.

**ఎతిహాద్:** ఎకానమీ టికెట్‌పై 10%, బిజినెస్ క్లాస్‌పై 5% రాయితీ ఇస్తుంది. ఈ ఆఫర్ జూన్ 30, 2025 వరకు వర్తిస్తుంది. విద్యార్థి %×ణ% లేదా యూనివర్సిటీ అడ్మిషన్ లెటర్ తప్పనిసరి.

**ఖతర్:** స్టూడెంట్ క్లబ్‌లో సభ్యత్వం ఉంటే 10%-%20% వరకు రాయితీ లభిస్తుంది. ఇది బుకింగ్ సమయం, రూట్‌పై ఆధారపడి ఉంటుంది. అదనంగా లాంజ్ యాక్సెస్, ప్రాయారిటీ బోర్డింగ్ వంటి సౌకర్యాలు ఉన్నాయి.

**షెడ్యూల్ సౌలభ్యం - టికెట్ మార్పుల సౌకర్యం**

వీసా జాప్యాల నేపథ్యంలో ఫ్లెక్సిబుల్ టికెట్ మార్పుల సౌకర్యం చాలా కీలకం:

**ఎమిరేట్స్:** ఫ్లెక్స్, ఫ్లెక్స్ ప్లస్ టికెట్‌లకు ఉచిత తేదీ మార్పు లభిస్తుంది. సేవర్ టికెట్‌లకు రుసుము ఉంటుంది.

**ఎతిహాద్:** ఒకసారి ఉచితంగా తేదీ మార్పు చేసుకునే అవకాశం ఉంది %-% ఇది విద్యార్థులకు చాలా అనుకూలంగా ఉంటుంది.

**ఖతర్:** స్టూడెంట్ క్లబ్ సభ్యులకు సౌలభ్యంగా టికెట్ మార్పులు చేసుకోవచ్చు, కానీ షరతులు రూట్‌పై ఆధారపడి ఉంటాయి.

**ప్రయాణ సమయం - కనెక్షన్‌లు, లేఓవర్‌లు**

విద్యార్థుల ప్రయాణ అనుభవాన్ని ప్రభావితం చేసే అంశాలలో ప్రయాణ సమయం, లేఓవర్‌లు ముఖ్యమైనవి.

**ఖతర్:** దోహా హబ్ ద్వారా వేగవంతమైన కనెక్షన్‌లు లభిస్తాయి. జెట్‌లాగ్ తక్కువగా ఉంటుంది.

**ఎమిరేట్స్:** దుబాయ్ హబ్ నుంచి కనెక్షన్‌లు మంచివే, కానీ లేఓవర్ సమయం కొంచెం ఎక్కువగా ఉండవచ్చు.

**ఎతిహాద్:** అబుదాబి హబ్ నుంచి ప్రయాణం సమర్థవంతంగా ఉంటుంది, కానీ ఖతర్‌తో పోలిస్తే కొంచెం ఎక్కువ సమయం పడుతుంది.

సామాను పరిమితుల దృష్టిలో ఎతిహాద్ ఉత్తమ ఎంపికగా నిలుస్తుంది. ప్రయాణ సమయంపై దృష్టి పెడితే ఖతర్ వేగవంతమైన కనెక్షన్‌లు అందిస్తుంది. రాయితీలు, టికెట్ మార్పుల సౌలభ్యం కూడా మూడు సంస్థలలో అందుబాటులో ఉన్నప్పటికీ, మీ వ్యక్తిగత అవసరాలను బట్టి సరైన ఎంపిక చేసుకోవడం ముఖ్యం.

# డమ్మీ అనుకుంటిరా.. డాడీని అవుతా..



**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణ రాజకీయాల్లో భారతీయ జనతా పార్టీ ప్రస్తుతం కొత్త జోష్‌తో దూసుకుపోతోంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో సంచలనం సృష్టిస్తున్నాయి. తనను "డమ్మీ లీడర్" అని విమర్శిస్తున్న వారికి త్వరలోనే తన సత్తా చూపిస్తానని, వారికి "డాడీ" అవుతానని ఆయన ఆగ్రహావేశాలతో కూడిన హెచ్చరికలు జారీ చేశారు. ఈ వ్యాఖ్యలు రాష్ట్రంలో బీజేపీ దూకుడుకు అద్దం పడుతున్నాయి.

పదవి కిరీటం కాదు.. బాధ్యత

రాష్ట్ర బీజేపీ అధ్యక్ష పదవి కేవలం గౌరవానికి సంబంధించిన కుర్చీ కాదని, అది ఒక పెద్ద బాధ్యత అని రాంచందర్ రావు స్పష్టం చేశారు. ప్రస్తుతం పార్టీ దృష్టి ప్రధానంగా స్థానిక సంస్థల ఎన్నికలపైనే ఉందని, రాష్ట్రవ్యాప్తంగా వీలైనన్ని స్థానాలను గెలుచుకోవడమే లక్ష్యంగా తాము కృషి చేస్తున్నామని ఆయన వెల్లడించారు.

**రాజా సింగ్ అంశం.. జాతీయ నాయకత్వం పరిధిలోనే**

రాజా సింగ్ అంశంపై స్పందిస్తూ, ఆ విషయాన్ని పార్టీ జాతీయ నాయకత్వమే చూసుకుంటుందని ఆయన తెలిపారు. "ఇక్కడ నేను డమ్మీనా కాదా అన్నది తక్కువ కాలంలోనే మీకు తెలుస్తుంది" అంటూ తన బలాన్ని చాటుకున్నారు. "తెలంగాణలో నన్ను మించి ఫైర్ బ్రాండ్ లీడర్ ఎవరూ లేరు" అంటూ రాంచందర్ రావు గర్వంగా ప్రకటించారు. తన సుదీర్ఘ రాజకీయ జీవితంలో 14 సార్లు జైలు పాలయ్యానని, లాఠీ దెబ్బలు తిన్నానని, మావోయిస్టులతోనూ పోరాడిన గతం తనకు ఉందని గుర్తు చేశారు. ఇది ఆయన నిబద్ధతకు, పోరాట పటిమకు నిదర్శనమని పేర్కొన్నారు.

**బూతులు మాట్లాడటం మాస్ కాదు.. సిద్ధాంతమే శక్తి**

చొక్కా విప్పి బూతులు మాట్లాడితే మాస్ లీడర్ కాలేరని రాంచందర్ రావు స్పష్టం చేశారు. సిద్ధాంతంతో ముందుకు సాగగలిగే నాయకులే నిజమైన నాయకులని అన్నారు. తనకు ఆ నమ్మకం, ఆ సంకల్పం ఉన్నాయని ధీమాగా చెప్పారు. ఇది ఆయన వ్యక్తిత్వాన్ని, రాజకీయ విలువలను చాటిచెబుతోంది.

**బీజేపీలో విభేదాలు లేవు.. బీఆర్ఎస్ ట్విట్టర్ పార్టీ**

రాష్ట్ర బీజేపీలో ఎలాంటి విభేదాలు లేవని, అందరం కలిసికట్టుగా పని చేస్తున్నామని రాంచందర్ రావు తెలిపారు. బీఆర్ఎస్ పార్టీని "ట్విట్టర్ పార్టీ"గా అభివర్ణించిన ఆయన, "దానితో ప్రజలకు ఉపయోగం లేదు" అని విమర్శించారు. తమ పోటీ ఎప్పుడూ కాంగ్రెస్‌తోనే ఉంటుందని ఆయన స్పష్టం చేశారు, తద్వారా రాష్ట్రంలో ప్రధాన రాజకీయ ప్రత్యర్థి ఎవరో తేల్చి చెప్పారు.

## సింగయ్య భార్యను బెదిరించారు..

# చంద్రబాబు సీరియస్



**హైదరాబాద్ పెన్ పవర్:** వైసీపీ కార్యకర్త సింగయ్య మరణం రాజకీయంగా హీట్ పుట్టిస్తోంది. గత నెల 18న మాజీ సీఎం జగన్ రెంటపాళ్ల పర్యటన సందర్భంగా గుంటూరు బైపాస్ లోని ఏటుకూరు వద్ద సింగయ్య అనే వ్యక్తి కారు కింద పడి మరణించిన విషయం తెలిసిందే. మాజీ సీఎం జగన్ పై పూలు జల్లేందుకు వెళ్లిన సింగయ్య ఆయన కారు కింద పడి మరణించినట్లు ప్రభుత్వం వీడియోలు విడుదల చేసింది. దీనిపై తమకు అనుమానాలు ఉన్నట్లు మృతుడి భార్య లూర్దు మేరి ప్రకటన చేశారు. అయితే ఆమె అలా మాట్లాడటానికి మాజీ సీఎం జగనే కారణమంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు.సింగయ్య మరణించి దాదాపు 15 రోజులు గడుస్తున్నా, ఆయన మృతికి కారణమైన ప్రమాదంపై రాజకీయ రగడ కొనసాగుతూనే ఉంది. తొలుత ప్రభుత్వం విడుదల చేసిన వీడియోలు ఏఐ జనరేటడ్ వీడియోలు అని వైసీపీ సందేహం వ్యక్తం చేసింది. తాజాగా మృతుడి కుటుంబ సభ్యులతో మాజీ ముఖ్యమంత్రి జగన్ భేటీ అయ్యారు. తాడేపల్లిలో తన నివాసానికి బాధితులను రప్పించుకున్న జగన్ పరామర్శించారు.పార్టీ అధినేత జగన్ ను కలిసిన తర్వాత మీడియాతో మాట్లాడిన సింగయ్య భార్య లూర్దు మేరి సంచలన ఆరోపణలు చేశారు. తన భర్త మరణంపై తనకు అనుమానాలు ఉన్నాయని తెలిపారు. మంత్రి లోకేశ్ మనుషులు తమ ఇంటికి వచ్చి తాము చెప్పమన్నట్లు చెప్పాలని ఒత్తిడి చేసినట్లు వెల్లడించారు. అంతేకాకుండా తాము జగన్ అభిమానులమని, ఆయన తమకు అండగా ఉంటారని చెప్పారు. కారు కింద పడిన సింగయ్యకు చిన్నచిన్న గాయాలే తగిలాయని, అంబులెన్సులోనే ఏదో జరిగిందని అనుమానం వ్యక్తం చేశారు.ఇక సింగయ్య భార్య వ్యాఖ్యలపై ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించారు. కుప్పం పర్యటనలో ఉన్న చంద్రబాబు గురువారం ఉదయం మీడియాతో మాట్లాడారు. సింగయ్య భార్యను పిలిపించి బెదిరించి రాజకీయం చేయాలని చూస్తారా? అంటూ చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏమీ చేయలేని వాళ్లే శవ రాజకీయాలు చేస్తుంటారని ఆరోపించారు. తప్పుడు ప్రచారాలు తాత్కాలికం.. చేసిన పనులే శాశ్వతమని చంద్రబాబు వ్యాఖ్యానించారు. కారు కింద పడిన వ్యక్తిని కుక్కపిల్ల మాదిరిగా పక్కన పడేసి వెళ్తారా? అంటూ ప్రశ్నించారు. కంప చెట్లలో పడేసి వెళ్లారంటే మానవత్వం ఉందా? అని ప్రశ్నిస్తున్నా.. కనీస బాధ్యత లేకుండా ప్రవర్తిస్తారా? అంటూ చంద్రబాబు వ్యాఖ్యానించారు.

# ఇంటింటికి టీడీపీ, వైసీపీ.. ఎక్కడ ఏం జరుగుతోంది?



**హైదరాబాద్ పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ రాజకీయాలు ప్రజల బాట పట్టాయి. ఎన్నికలు జరిగి ఏడాది కావడంతో ప్రభుత్వంలో ప్రధాన భాగస్వామి అయిన టీడీపీ 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం నిర్వహిస్తోంది. ఇదే సమయంలో విపక్ష వైసీపీ'రీ కాల్ చంద్రబాబు మేనిఫెస్టో' కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ రెండు కార్యక్రమాల ద్వారా ఆయా పార్టీలు ఇంటింటికి వెళ్లాలనేది ముఖ్య ఉద్దేశం. ఏడాది విజయాలు చెప్పుకోవాలని టీడీపీ.. ఈ ఏడాదిలో హామీలు అమలు చేయలేదని వైసీపీ ప్రచారం చేయాలని నిర్ణయించాయి. సుమారు నెల రోజులపాటు జరిగే ఈ కార్యక్రమంలో తొలి మూడు రోజులు ఎలా జరిగింది? అన్న విషయమై ప్రజలు ఆరా తీస్తున్నారు.టీడీపీ చేపట్టిన 'సుపరిపాలన తొలి అడుగు' కార్యక్రమం బుధవారం రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభమైంది. ముఖ్యమంత్రి చంద్రబాబు తన సొంత నియోజకవర్గం కుప్పంలో 'తొలి అడుగు' కార్యక్రమం నిర్వహించారు. మంత్రి నారా లోకేశ్ తన నియోజకవర్గం పరిధిలోని తాడేపల్లిలో పర్యటించారు. అదేవిధంగా క్యాబినెట్ లో ఉన్న టీడీపీ మంత్రులు, ఎమ్మెల్యేలు అంతా ఈ కార్యక్రమాన్ని 2వ తేదీన ప్రారంభించారు. విదేశీ పర్యటనకు వెళ్లిన కొందరు ఎమ్మెల్యేలు తమ పర్యటనను రద్దు చేసుకుని నియోజకవర్గాలకు వచ్చి, 'తొలి అడుగు' నిర్వహించారు. ఈ ఏడాదిలో ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను వివరించడంతోపాటు పెట్టుబడులు, ఉద్యోగాల సృష్టి, అభివృద్ధి పనులను వివరించారు.ముఖ్యమంత్రి చంద్రబాబు కుప్పం నియోజకవర్గంలోని శాంతిపురంలో రాత్రి 11 గంటల వరకు పర్యటించారు. అదేవిధంగా మంత్రి లోకేశ్ తాడేపల్లిలోని మహానాడు కాలనీలో ఇంటింటికి వెళ్లారు. ఆయనతో సెల్ఫీలు తీసుకునేందుకు మహిళలు, పిల్లలు పోటీ పడ్డారు. మరోవైపు కూటమిలో భాగస్వామ్య పక్షాలైన బీజేపీ, జనసేన ఎక్కడ కూడా 'తొలి అడుగు' కార్యక్రమంలో కనిపించలేదు. ఈ కార్యక్రమం పూర్తిగా టీడీపీ ఆధ్వర్యంలోనే జరుగుతుండటంతో అధికార వర్గాలు కూడా హాజరుకాలేదు.ఇదే సమయంలో 'రీ కాల్ చంద్రబాబు మేనిఫెస్టో' నిర్వహించాలని వైసీపీ అధినేత జగన్ పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. గత నెల నిర్వహించిన వైసీపీ విస్తృత స్థాయి సమావేశంలో 'రీ కాల్ చంద్రబాబు మేనిఫెస్టో' కింద వైసీపీ శ్రేణులు ప్రతి ఇంటికి వెళ్లి ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వివరించాలని సూచించారు. దీని కోసం ప్రత్యేక క్యూఆర్ కోడ్ ను రూపొందించి వైసీపీ శ్రేణులకు అందజేశారు. ఆ క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే చంద్రబాబు ఇచ్చిన హామీలు వస్తాయని, ప్రజలు ఏ విధంగా మోసపోయారో గుర్తు చేయొచ్చని తెలిపారు.ఐదు దశల్లో ఈ కార్యక్రమం నిర్వహించాల్సివుండగా, అధినేత జగన్ చెప్పినట్లు గ్రామస్థాయిలో ఎక్కడా ఈ కార్యక్రమం ప్రారంభించిన సూచనలు కనిపించలేదు. అధినేత జగన్ సైతం బుధవారం రోజంతా తాడేపల్లిలోని తన నివాసంలోనే గడిపారు. ఇక మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు ఎవరూ క్షేత్రస్థాయిలో పర్యటించినట్లు వైసీపీ ప్రకటించలేదు. అయితే ఇదే సమయంలో జిల్లా, నియోజకవర్గ స్థాయి సమావేశాలు మాత్రం నిర్వహిస్తున్నారు. అయితే టీడీపీ ఎమ్మెల్యేలు కన్నా ముందే ప్రతి ఇంటికి వెళ్లి ఎన్నికల హామీలు గుర్తుచేయాలన్న అధినేత జగన్ ఆదేశాలు మాత్రం ఇంకా అమలు కాలేదు. అయితే కార్యక్రమ నిర్వహణకు నెల రోజుల వ్యవధి విధించడమే వైసీపీ శ్రేణులు ఇంకా కదలలేదని అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# షికాగో ఆల్బమ్ పార్టీలో మారణ హోమం: నలుగురు మృతి



**హైదరాబాద్ పెన్ పవర్:** అమెరికాలోని షికాగో నగరంలో సోమవారం అర్ధరాత్రి దాటిన తరువాత జరిగిన కాల్పులు తీవ్ర కలకలం రేపాయి. ఈ దాడిలో నలుగురు ప్రాణాలు కోల్పోగా, మరో 14 మంది తీవ్రంగా గాయపడ్డారు. షికాగో పోలీసుల ప్రాథమిక నివేదిక ప్రకారం, మృతులలో ఇద్దరు పురుషులు, ఇద్దరు మహిళలు ఉన్నారు.

**పార్టీలో మారణహోమం**

ఈ దారుణ ఘటన చికాగోలోని రివర్ నార్త్ ప్రాంతంలో ఉన్న ఒక రెస్టారెంట్ దగ్గర జరిగిన ఓ ఆల్బమ్ రిలీజ్ పార్టీ సమయంలో చోటుచేసుకుంది. పార్టీకి సంబంధించిన లాంజ్‌లో ఉన్న వారిపై ఓ గుర్తు తెలియని దుండగుడు తుపాకీతో కాల్పులు జరిపి అక్కడి నుంచి పరారయ్యాడు.

**బాధితుల వివరాలు**

కాల్పులకు గురైనవారిలో 13 మంది మహిళలు, ఐదుగురు పురుషులు ఉన్నారు. మృతుల వయస్సు 21 నుంచి 32 సంవత్సరాల మధ్యగా ఉందని పోలీసులు తెలిపారు. గాయపడిన వారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వెల్లడించారు. బాధితులను సమీపంలోని ఆసుపత్రులకు తక్షణమే తరలించి చికిత్స అందిస్తున్నారు.

**దర్యాప్తు ప్రారంభం**

పోలీసులు కేసును పరిశీలిస్తూ దుండగుడి కోసం విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు. పరిసర ప్రాంతాల్లో ఉన్న సీసీటీవీ ఫుటేజీలను పరిశీలిస్తూ నిందితుడి ఆచూకీ కోసం ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. ఈ దాడి కారణాలు, దాని వెనుక ఉన్న ఉద్దేశ్యాలపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది.

# వియన్నాలో ఆగిపోయిన ఎయిరిండియా విమానం.. కారణం ఇదే!



**హైదరాబాద్ పెన్ పవర్:** జపాన్ నుండి ఢిల్లీకి బయలుదేరిన ఎయిరిండియా విమానం ఏఐ 357.. పలు సమస్యల కారణంగా ముందుజాగ్రత్తగా కోల్ కతాకు మళ్లించి సేఫ్ ల్యాండ్ చేయబడిన సంగతి తెలిసిందే. దీంతో.. ఈ విమానం టోక్యోలోని హనేడా విమానాశ్రయం నుండి న్యూఢిల్లీ విమానాశ్రయానికి వెళుతుండగా.. సాంకేతిక సమస్యను సిబ్బంది నివేదించారు.ఇదే సమయంలో... జూన్ 27న ముంబై నుండి చెన్నైకి బయలుదేరిన ఎయిరిండియా విమానం ఏఐ639.. క్యాబిన్ లోపల మండుతున్న వాసనను సిబ్బంది గుర్తించిన తర్వాత టేకాఫ్ అయిన కొద్దిసేపటికే ముంబైకి తిరిగి రావాల్సి వచ్చింది! ఈ సమయంలో తాజాగా... ఢిల్లీ నుంచి బయలుదేరిన మరో విమానాన్ని అత్యవసరంగా మధ్యలోనే ఆపేశారు!అవును... బుధవారం తెల్లవారుజామున 12:45 గంటలకు బయలుదేరి గురువారం రాత్రి 8:45 గంటలకు వాషింగ్టన్, డీసీ చేరుకోవాల్సిన ఏఐ103 విమానం రద్దు చేయబడింది. ఇందులో భాగంగా.. సాంకేతిక లోపంతో వియన్నాలో ఆపేసి, క్యాన్సిల్ చేశారు! ఫలితంగా... వాషింగ్టన్, డీసీ నుండి వియన్నా మీదుగా ఢిల్లీకి వెళ్లే ఏఐ104 విమానం కూడా రద్దు చేయబడింది.ఈ సందర్భంగా స్పందించిన ఎయిరిండియా ప్రతినిధి ఒకరు... జూలై 2 - 2025న ఢిల్లీ నుండి వాషింగ్టన్, డీసీ వెళ్లే ఏఐ 103 విమానం వియన్నాలో ప్రణాళికాబద్ధమైన ఇంధన స్టాప్ ను ఏర్పాటు చేసిందని.. సాధారణ విమాన తనిఖీల సమయంలో, అదనపు మెయింటెనెన్స్ పనిని గుర్తించారని.. దీనిని నెక్స్ట్ ఫ్లైట్ కంటే ముందు సరిదిద్దడానికి అదనపు సమయం అవసరం అని తెలిపారు!దీని కారణంగా.. వియన్నా నుండి వాషింగ్టన్, డిసికి వెళ్లే విమానం రద్దు చేయబడింది.. ప్రయాణీకులను దింపేశారు. ఈ సందర్భంగా... ఈ అసౌకర్యానికి తీవ్రంగా చింతిస్తున్నామని.. ప్రయాణీకులందరి భద్రతతో పాటు సిబ్బంది భద్రతకు ప్రాధాన్యత ఇవ్వడానికి కట్టుబడి ఉన్నామని ఎయిర్ లైన్ తెలిపింది.ఇదే సమయంలో... వీసా రహిత ప్రవేశానికి అర్హత ఉన్న ప్రయాణీకులకు లేదా చెల్లుబాటు అయ్యే స్కెంజెన్ వీసాలు ఉన్నవారికి నెక్స్ట్ విమానం అందుబాటులోకి వచ్చే వరకు వియన్నాలో హోటల్ వసతి కల్పించబడిందని తెలిపింది. ప్రవేశ అనుమతి లేని వారికి.. ఆస్ట్రియన్ అధికారులతో మాట్లాడి ప్రత్యేక వసతి ఏర్పాట్లు చేయబడ్డాయని తెలిపింది!

# చైనా అధ్యక్షుడ్ని మార్చడం సాధ్యమేనా?



**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రపంచ రాజకీయాల్లో చైనా ఒక కీలక పాత్ర పోషిస్తున్న దేశం. ఆ దేశాన్ని పాలిస్తున్న వ్యక్తి జీ జిన్ పింగ్ అయితే, ఇప్పుడు ఆయన కనిపించడం లేదు. అంతర్జాతీయ మీడియాలో వస్తున్న వార్తల ప్రకారం జిన్ పింగ్ ఇటీవల జరిగిన కొన్ని ముఖ్యమైన సమావేశాలకు హాజరుకాలేదు. ముఖ్యంగా బ్రిక్స్ సమావేశానికి ఆయన ప్రత్యక్షంగా హాజరుకాకపోవడం గమనార్హం. దీంతో ఆయన ఆరోగ్యం, గుట్టుచప్పుడు కాకుండా నాయకత్వ మార్పు జరుగుతోందా అన్న చర్చలకు బలమవుతోంది.

**చైనాలో పాలన ఎలా ఉంటుంది?**

చైనా ప్రజాస్వామ్య దేశం కాదు. కానీ ఓ నియంతృత్వ పాలన కూడా కాదు. అక్కడ "ఏకపక్ష పాలన" ఉంది. కమ్యూనిస్టు పార్టీ ఆదేశమే చైనాలో శాసనం. పార్టీకి చెందిన పాలక వర్గమే అన్ని అధికారాలను నిర్వర్తిస్తుంది. మిలటరీ కూడా ప్రభుత్వానికి కాదని, కమ్యూనిస్టు పార్టీకి కట్టుబడి ఉంటుంది. దీన్ని "పార్టీ మిలటరీ" అంటారు. ఈ నేపథ్యంలో పార్టీ అధినేత అయిన జీ జిన్ పింగ్‌కు అపారమైన అధికారాలు ఉన్నాయి.

**జీవితాంతం అధ్యక్షుడిగా?**

2018లో చైనా రాజ్యాంగంలో చేసిన మార్పుతో అధ్యక్ష పదవికి గడువు పరిమితి తొలగించబడింది. దీంతో జిన్ పింగ్ జీవితాంతం అధ్యక్షుడిగా కొనసాగే వీలుకలిగింది. ఈ నిర్ణయం ద్వారా ఆయన అధికారాన్ని మరింత బలపరిచారు. పార్టీపై పూర్తి పట్టు సాధించిన జిన్ పింగ్‌కు వ్యతిరేకులు పార్టీ లోపల కనబడడమే లేదు. ఆయన నిర్ణయమే తుదినిర్ణయం.

**పదవి కోల్పోవడం అంత తేలిక కాదు**

చైనా వంటి ఒక గట్టి రాజకీయ వ్యవస్థలో, అది కూడా జీ జిన్ పింగ్ వంటి నాయకుడి హయాంలో అధ్యక్షుడిని మారుస్తామంటే అది సాధారణ విషయం కాదు. పార్టీ చీఫ్, సైనికాధ్యక్షుడు, రాష్ట్రపతి.. ఈ మూడు హోదాలు కలిసే ఒకే వ్యక్తిలో ఉంటాయి. అతన్ని పదవి నుంచి తొలగించాలంటే, పార్టీ అగ్రనాయకత్వమే తిరుగుబాటు చేయాలి. అలాంటి పరిస్థితులు ఇప్పటికైతే కనిపించట్లేదు.

**జిన్ పింగ్ అసలు ఎక్కడ?**

ఇంతకీ జిన్ పింగ్ ఎక్కడ? ఈ ప్రశ్నకు స్పష్టమైన సమాధానం ఇంకా బయటకు రాలేదు. గతంలోనూ ఆయన కొన్ని వారాల పాటు కనిపించకుండా ఉండిన సందర్భాలు ఉన్నాయి. తర్వాత తిరిగి ప్రత్యక్షమయ్యారు. ఇప్పుడు కూడా ఆయన మళ్లీ బయటపడతారని చాలామంది విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే అంతర్జాతీయ మీడియాలో "వాంగ్ యంగ్" అనే నాయకుడిని జిన్ పింగ్ స్థానంలో పెట్టే ఆలోచన జరుగుతోందని కథనాలు వస్తుండటం మాత్రం ఆసక్తికరం.

చైనా అధ్యక్షుడిని మార్చడం, అది కూడా జిన్ పింగ్ లాంటి పవర్ ఫుల్ నాయకుడిని తొలగించడం అంత సులువు కాదు. కానీ రాజకీయాలలో ఊహించని మలుపులు సాధారణమే. జిన్ పింగ్ కనిపించకపోవడమే కొన్ని వార్తలకు బీజం కావొచ్చు. కానీ నిజమైన మార్పు జరిగితే, అది చైనా రాజకీయాల్లో పెద్ద తలకిందులే కావచ్చు.

# ట్రంప్‌పై దావా వేసిన 20 రాష్ట్రాలు!

**హైదరాబాద్ పెన్ పవర్:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై మరోసారి తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తాయి. మెడిక్‌ఎయిడ్ ద్వారా సేవలు పొందుతున్న లక్షల మంది అమెరికా ప్రజల ప్రైవేటు ఆరోగ్య సమాచారాన్ని డిపోర్టేషన్ అధికారులకు అందించారని ఆరోపిస్తూ 20 రాష్ట్రాల అటార్నీ జనరళ్ల బృందం ట్రంప్‌పై సంయుక్తంగా దావా వేసింది.ఈ విషయాన్ని కాలిఫోర్నియా అటార్నీ జనరల్ రాబ్ బోంటా మంగళవారం అధికారికంగా ప్రకటించారు. ట్రంప్ పరిపాలన సమయంలో ఆరోగ్య శాఖ మంత్రి రాబర్ట్ ఎఫ్ కెన్నడీ జూనియర్ సలహాదారులు, కాలిఫోర్నియా, ఇల్లినోయీ, వాషింగ్టన్, వాషింగ్టన్ డీసీ లాంటి రాష్ట్రాల నుండి మెడిక్‌ఎయిడ్ డేటాను అక్రమంగా హోంలాండ్ సెక్యూరిటీ అధికారులకు పంపించారని ఆరోపించారు.

**డేటాలో ఏం ఉన్నది?**

ఈ డేటాలో ఆరోగ్య రికార్డులు మాత్రమే కాకుండా, వ్యక్తుల పేర్లు, చిరునామాలు, సోషల్ సెక్యూరిటీ నంబర్లు, ఇమ్మిగ్రేషన్ స్థితి వంటి వ్యక్తిగత సమాచారమూ ఉన్నట్లు తెలుస్తోంది. ఇది తీవ్ర ఆందోళనకరమని, దీనివల్ల అక్రమంగా అమెరికాలో నివసిస్తున్న వలసదారులను గుర్తించి వారిని బలవంతంగా స్వదేశాలకు పంపించే అవకాశముందని న్యాయవాదులు హెచ్చరిస్తున్నారు.

**చట్ట ఉల్లంఘన**

ఈ చర్యలు ఫెడరల్ హెల్త్ ప్రైవసీ చట్టాలు.. ముఖ్యంగా హెల్త్ ఇన్సూరెన్స్ పోర్టబిలిటీ అండ్ అకౌంటబిలిటీ యాక్ట్ ఉల్లంఘనకేనని అటార్నీ జనరళ్లు స్పష్టం చేశారు. HIPAA ప్రకారం.. వ్యక్తిగత ఆరోగ్య డేటాను ప్రైవసీ కింద రహస్యంగా ఉంచాలి. ప్రభుత్వ అవసరాల పేరుతో ఇలాంటివి ఇతర శాఖలకు ఇవ్వడం అనేది స్పష్టంగా చట్టవిరుద్ధమని వారు పేర్కొన్నారు.

**ప్రభావిత రాష్ట్రాలు & స్పందన**

ఈ చర్యల వల్ల ముఖ్యంగా వలసదారులు ఎక్కువగా నివసించే రాష్ట్రాలైన కాలిఫోర్నియా, ఇల్లినోయి, వాషింగ్టన్ ప్రభావితమయ్యాయి. ఈ రాష్ట్రాల్లో పౌరసత్వం లేకపోయినా, మెడిక్‌ఎయిడ్ కోసం అనేక మంది నామినేషన్ చేసుకుంటారు. అటువంటి వారి సమాచారాన్ని అక్రమంగా ఇతర శాఖలకు పంపించడంపై పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ట్రంప్ పరిపాలనలో తీసుకున్న చర్యలు తరచూ వివాదాస్పదంగా మారడం కొత్తేం కాదు. అయితే ప్రజల ప్రైవసీకి సంబంధించిన ఇలాంటి చట్ట ఉల్లంఘనపై దేశవ్యాప్తంగా తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఈ దావా ఎలా పరిణమించనుందో చూడాలి.

# ఆసియా కప్‌లో పాకిస్థాన్ ఆడతానంటే అడ్డుకోము: భారత క్రీడా మంత్రిత్వ శాఖ



**హైదరాబాద్ పెన్ పవర్:** భారత్ వేదికగా హాకీ ఆసియా కప్ ఆగస్టు 27 నుండి సెప్టెంబర్ 7 వరకు బీహార్‌లో జరగనుంది. ఈ టోర్నమెంట్‌లో పాల్గొనే జట్లలో పాకిస్తాన్ ఒకటి. భారత్, పాకిస్థాన్ సరిహద్దు ఉద్రిక్తల నేపథ్యంలో నిన్నటివరకు పాకిస్థాన్ ఈ టోర్నీలో ఆడదేమో అనే అనుమానాలు నెలకొన్నాయి. అయితే పాకిస్థాన్ జట్టును ఆసియా కప్ లో ఆడకుండా తాము అడ్డుకోమని భారత క్రీడా మంత్రిత్వ శాఖ చెప్పుకొచ్చింది."వరల్డ్ కప్, ఆసియా కప్ లాంటి పెద్ద టోర్నీల్లో పాకిస్థాన్ పాల్గొనేందుకు అవకాశం ఉంటుంది. పాక్ ఆడతామంటే మేము వ్యతిరేకించం. వారు ఆడకుండా వారిని అడ్డుకోము. ఇది ద్వాపక్షిక సిరీస్ కాదు. అంతర్జాతీయ క్రీడలు పోటీ నుండి మనం వెనక్కి తగ్గకూడదని డిమాండ్ చేస్తున్నాయి. రష్యా మరియు ఉక్రెయిన్ యుద్ధంలో ఉన్నాయి. కానీ అవి బహుళ జాతీయ ఈవెంట్లలో ఆడుతూ కనిపిస్తాయి" అని క్రీడా మంత్రిత్వ శాఖ వర్గాలు గురువారం (జూలై 3) తెలిపాయి. పాకిస్తాన్ హాకీ జట్టు చివరిసారిగా ఛాంపియన్స్ ట్రోఫీ టోర్నమెంట్ కు 2023లో ఇండియాకు వచ్చింది. ఆసియా కప్ విషయానికొస్తే.. ఇండియా, పాకిస్తాన్‌తో సహా మొత్తం 8 జట్లు పాల్గొననున్నాయి. ఆతిథ్య దేశంగా ఇండియా ఈ టోర్నమెంట్‌కు అర్హత సాధించింది. మిగిలిన ఐదు జట్లు - చైనా, జపాన్, మలేషియా, పాకిస్తాన్, దక్షిణ కొరియా ఈ మెగా టోర్నీలో పాల్గొననున్నాయి. ఈ సంవత్సరం ఏప్రిల్‌లో జరిగిన %నాంఖీ% కప్ ఫైనల్‌కు చేరుకున్న ఒమన్, చైనీస్ తైపీ ఈ టోర్నమెంట్‌కు అర్హత సాధించాయి. ఈ టోర్నమెంట్ విజేత వచ్చే ఏడాది జరగనున్న మెన్స్ హాకీ ప్రపంచ కప్‌కు అర్హత సాధిస్తుంది. దీంతో ఈ టోర్నీని అన్ని జట్లు సీరియస్ గా భావిస్తున్నాయి. 2022లో జరిగిన ఆసియా కప్‌లో దక్షిణ కొరియా ఐదవసారి రికార్డు స్థాయిలో గెలిచింది. మలేషియా రన్నరప్‌గా నిలవగా, జపాన్‌ను ఓడించి భారత్ మూడవ స్థానంలో నిలిచింది. ఆసియా కప్ చరిత్రలో ఇండియా మూడుసార్లు ఆసియా కప్‌ను గెలుచుకుంది. 2017లో చివరిసారిగా మలేషియాను ఓడించి ఆసియా కప్ గెలుచుకుంది.

# కెప్టెన్ ఒంటరి పోరాటం: గిల్ భారీ సెంచరీ.. 400 పరుగులు దాటిన టీమిండియా



**హైదరాబాద్ పెన్ పవర్:** ఎడ్జ్ బాస్టన్ లో ఇంగ్లాండ్ తో జరుగుతున్న రెండో రెస్టులో టీమిండియా భారీ స్కోర్ దిశగా దూసుకెళ్తుంది. తొలి రోజు గిల్, జడేజా భాగస్వామ్యంతో కోలుకున్న టీమిండియా.. రెండో రోజు వీరి పట్టుదలతో 400 పరుగుల మార్క్ దాటింది. రెండో రోజు లంచ్ సమయానికి 6 వికెట్ల నష్టానికి 419 పరుగులు చేసింది. క్రీజ్ లో గిల్ (168), వాషింగ్ టన్ సుందర్ (1) ఉన్నారు. రెండో సెషన్ లో సుందర్ తో కలిసి గిల్ ఎంతవరకు భారత జట్టును ముందుకు తీసుకెళ్తాడో ఆసక్తికరంగా మారింది. 5 వికెట్ల నష్టానికి 310 పరుగులతో రెండో రోజు ఆట ప్రారంభించిన టీమిండియా తొలి సెషన్ లో జాగ్రత్తగా ఆడింది. గిల్, జడేజా ఎలాంటి అనవసర షాట్స్ జోలికి పోకుండా వీలు చిక్కినప్పుడల్లా బౌండరీలు కొట్టి స్కోర్ బోర్డును ముందుకు తీసుకెళ్లారు. ఈ క్రమంలో జడేజా తన హాఫ్ సెంచరీ మార్క్ అందుకున్నాడు. మరోవైపు తొలి రోజు సెంచరీ హీరో గిల్ 150 పరుగులను పూర్తి చేసుకున్నాడు. వీరిద్దరూ పట్టుదలగా.. ఓపిగ్గా బ్యాటింగ్ చేయడంతో భారత్ తొలి సెషన్ లో ఆధిపత్యం చూపించింది. ఆరో వికెట్ కు 203 పరుగుల భారీ భాగస్వామ్యం తర్వాత ఎట్టకేలకు ఇంగ్లాండ్ కు వీరి జోడీని విడగొట్టింది. జోష్ టంగ్ బౌలింగ్ లో జడేజా వికెట్ కీపర్ కు క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. 89 పరుగులు చేసిన జడేజా తృటిలో సెంచరీ చేజార్చుకున్నాడు. ఆ తర్వాత సుందర్ తో కలిసి గిల్ మరో వికెట్ పడకుండా సెషన్ ముగించాడు. ఇంగ్లాండ్ బౌలర్లలో వోక్స్ రెండు వికెట్లు పడగొట్టాడు. కార్స్, టంగ్, స్టోక్స్, బషీర్ తలో వికెట్ పడగొట్టారు. తొలి రోజు ఆటలో భాగంగా జైశ్వాల్ 87 పరుగులు చేసి రాణించాడు.

# ఇంగ్లాండ్ బౌలర్ చీప్ ట్రిక్స్.. గిల్ ఏకాగ్రతను దెబ్బ కొట్టేందుకు స్కెచ్



**హైదరాబాద్ పెన్ పవర్:** బర్మింగ్‌హామ్ వేదికగా ఇంగ్లాండ్ తో జరుగుతున్న రెండో టెస్టులో టీమిండియా భారీ స్కోర్ దిశగా దూసుకెళ్తుంది. తొలి రోజు తడబడిన టీమిండియా గిల్, జడేజా భాగస్వామ్యంతో తొలి రోజు ఇంగ్లాండ్ పై టీమిండియా ఆధిపత్యం చూపించింది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (216 బాల్స్‌లో 12 ఫోర్లతో 114 బ్యాటింగ్) సెంచరీకి తోడు యశస్వి జైస్వాల్ (87) మెరుగ్గా ఆడటంతో.. తొలి ఇన్నింగ్స్‌లో ఇండియా 85 ఓవర్లలో 310/5 స్కోరు చేసింది. మొదటి రోజు ఆటలో భాగంగా గిల్ సెంచరీ హైలెట్ గా నిలిచింది. కెప్టెన్ ఇన్నింగ్స్ తో బాధ్యతగా ఆడుతూ జట్టును ముందుకు తీసుకెళ్లాడు. ఎన్ని విధాలుగా ప్రయత్నించినా గిల్ ను ఔట్ చేయడం ఇంగ్లాండ్ వలన కాలేదు. అయితే తొలి రోజు ఆటలో భాగంగా గిల్ ను ఔట్ చేసేందుకు ఇంగ్లాండ్ బౌలర్ కార్స్ చేసిన చీప్ ట్రిక్స్ చర్చనీయాంశంగా మారుతుంది. లంచ్ తర్వాత కార్స్ బౌలింగ్ యాక్షన్ మొదలుపెట్టి బాల్ రిలీజ్ చేసే ముందు ఎడమ చేతిని దూరంగా చాచి చూపించాడు. దీంతో ఏకాగ్రత కోల్పోయిన గిల్.. బంతిని ఆడకుండానే తప్పుకున్నాడు. అంపైర్ తో మాట్లాడుతూ కార్స్ చేసిన పనిని వివరించాడు. అంపైర్లు కూడా కార్స్ కు వార్నింగ్ ఇవ్వడం కూడా జరిగింది. ఆ తర్వాత కార్స్ వేసిన ఇన్స్ స్వింగ్ బంతిని గిల్ ఆడడంలో విఫలమయ్యాడు. అంపైర్ నాటౌట్ ఇవ్వడంతో ఇంగ్లాండ్ రివ్యూ తీసుకుంది. రివ్యూలో బ్యాట్ ఇన్ సైడ్ ఎడ్జ్ తగలడంతో బతికిపోయాడు. ఈ ఇంగ్లీష్ పేసర్ చేసిన పనికి సోషల్ మీడియాలో తీవ్ర విమర్శలు వస్తున్నాయి. ఒకవేళ విచారణ జరిపి కార్స్ ఉద్దేశ్యపూర్వకంగా ఈ చర్యకు పాల్పడినట్లైతే అతనికి ఫైన్ విధించే అవకాశం ఉంది. ఈ మ్యాచ్ లో కార్స్ కరుణ్ నాయర్ వికెట్ తీసుకున్నాడు. మరోవైపు గిల్ (114లి) సెంచరీతో తొలి రోజు అజేయంగా నిలిచాడు.

# 'సలార్ 2' అనుమానాలు... సమాధానాలు!

ప్రభాస్ హీరోగా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో వచ్చిన 'సలార్' సినిమా బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని సొంతం చేసుకుంది. సలార్ వచ్చిన వెంటనే సలార్ 2 సైతం వస్తుందని మేకర్స్ స్వయంగా చెప్పారు. కానీ రెండేళ్లు కావస్తున్నా ఇప్పటి వరకు సలార్ 2 విషయమై దర్శకుడు ప్రశాంత్ నీల్ నోరు మెదపడం లేదు. సలార్ 2 సినిమాలో అసలైన కంటెంట్ ఉంటుందని, సినిమా కథ మొత్తం అందులోనే ఉంటుందని మేకర్స్ చెబుతూ వచ్చారు. మొదటి పార్ట్ చూసిన ప్రతి ఒక్కరూ సినిమాలో మిగిలి పోయిన ప్రశ్నలకు రెండో పార్ట్‌లో సమాధానాలు ఉంటాయని ఎదురు చూస్తున్నారు. కానీ ప్రశాంత్ నీల్ మాత్రం సలార్ 2 సినిమాను ఎప్పుడు తీసుకు వచ్చేది చెప్పడం లేదు. ప్రస్తుతం ప్రశాంత్ నీల్ 'డ్రాగన్' సినిమాను చేస్తున్న విషయం తెల్సిందే. ఎన్టీఆర్ హీరోగా రూపొందుతున్న డ్రాగన్ సినిమాను వచ్చే ఏడాది సమ్మర్‌లో ప్రేక్షకుల ముందుకు తీసుకు రాబోతున్నారు. డ్రాగన్ సినిమా షూటింగ్ ఇప్పటికే సగానికి పైగా పూర్తి చేసినట్లు వార్తలు వస్తున్నాయి. ఎన్టీఆర్ ఫ్యాన్స్ ఈ సినిమాపై చాలా అంచనాలు పెట్టుకుని ఎదురు చూస్తున్నారు, డ్రాగన్ సినిమా షూటింగ్ ప్రారంభం అయినప్పటి నుంచి అంచనాలు పెరుగుతూనే ఉన్నాయి. డ్రాగన్ సినిమా తర్వాత సలార్ 2 వస్తుందని అంతా



భావిస్తున్నారు. ఇటీవల ప్రశాంత్ నీల్ కొత్త ప్రాజెక్ట్‌కు కమిట్ అయ్యాడు. అల్లు అర్జున్‌తో ఒక సినిమాను ప్రశాంత్ నీల్ చేయబోతున్నాడు.

ప్రస్తుతం అట్లీతో అల్లు అర్జున్ చేస్తున్న సినిమా పూర్తి అయిన తర్వాత ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో నటించే అవకాశాలు ఉన్నాయి. భారీ అంచనాల నడుమ రూపొందుతున్న డ్రాగన్ సినిమా విడుదల తర్వాత సలార్ 2 విడుదల ఉంటుందని ఎదురు చూస్తున్న వారికి అల్లు అర్జున్‌తో ప్రశాంత్ నీల్ మూవీ అంటూ వస్తున్న వార్తలు కలవరానికి గురి చేస్తున్నాయి. సలార్ 2 సినిమా ఉండదేమో అని కూడా కొందరు కామెంట్స్ చేస్తున్నారు. కానీ సలార్ 2 గురించి చాలా మందికి తెలియని విషయం ఏంటంటే ఇప్పటికే ఆ సినిమా షూటింగ్ 80 నుంచి 90 శాతం పూర్తి చేశారు. కనుక విడుదల కచ్చితంగా ఉండక పోవడం అనేది ఉండదు. సలార్ 2 నేడు కాకుంటే మరికొన్ని రోజుల తర్వాత అయినా విడుదల ఉంటుంది.సలార్ 2 సినిమా 2026 ద్వితీయార్థంలో విడుదల అయ్యే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది. డ్రాగన్ సినిమా విడుదల తర్వాత రెండు నెలల సమయం తీసుకుని దర్శకుడు ప్రశాంత్ నీల్ సలార్ 2 ను ప్రేక్షకుల ముందుకు తీసుకు వచ్చే అవకాశాలు ఉన్నాయి. సలార్ 2 వంటి సినిమాలు ఎంతగా వెయిట్ చేయిస్తే అంతగా వెయిట్ పెరుగుతాయి. అందుకే సలార్ 2 ను కాస్త ఆలస్యంగా తీసుకు రావడం మంచిది అనే అభిప్రాయంతో ప్రశాంత్ నీల్ ఉండవచ్చు అనే అభిప్రాయంను కొందరు వ్యక్తం చేస్తున్నారు. సలార్ 2 మొత్తానికే క్యాన్సల్ అయ్యి ఉండవచ్చు అంటూ సోషల్ మీడియాలో కొందరు చేస్తున్న ప్రచారం పూర్తిగా అవాస్తవం. ఖచ్చితంగా సలార్ 2 ఉంటుంది, అది మొదటి పార్ట్‌ను మించి ఉండటం మాత్రమే కాకుండా అంతకు మించి అన్నట్లు వసూళ్లు నమోదు చేయడం ఖాయం.

**చీరలో ఆకాంక్ష శర్మ యొక్క సొగసైన లుక్**



**శ్రీజితా ఘోష్ ఒక ఆత్మీయ క్షణాన్ని పంచుకున్నారు**



On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com